గురువారం
6-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 164
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రాహుల్ గాంధీకి రూ.200 జరిమానా

లక్నో: సావర్కర్ పై ఆరోపణల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లక్నో కోర్టు రూ.200 జరిమానా విధించింది. నోటీసులు జారీ చేసినా కోర్టుకు హాజరు కాకపోవడంతో రాహుల్‌కు జరిమానా విధించింది. వచ్చే ఏప్రిల్ 14వ తేదీన కచ్చితంగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సావర్కర్‌పై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. బ్రిటిష్ వారికి సావర్కర్ లేఖ రాశారని, తన చర్యలకు క్షమాపణ చెప్పారని, తద్వారా మహాత్మాగాంధీ, ఇతర స్వాంతంత్ర్య యోధుల పోరాటాన్ని నీరుగార్చారని రాహుల్ గాంధీ

- మిగతా 2 లో

రేపు ఢిల్లీకి రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర–హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం మరోమారు దేశ రాజధాని ఢిల్లీ వెళ్లనున్నారు. ఆయన రెండు రోజులు అక్కడే ఉంటారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు నేపథ్యంలో రేవంత్ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈనెల 7, 8 తేదీల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు కావచ్చని పీసీసీ వర్గాలు పేర్కొన్నాయి. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఢిల్లీ వెళ్లవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. కోర్ కమిటీ ఢిల్లీలో ఉంటే ఏఐసీసీతో

- మిగతా 2 లో

పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం

విశాలాంధ్ర – హైదరాబాద్ : ఎంతో ఉత్కంఠంగా సాగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించారు. మొదటి నుంచి కూడా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి పై అంజిరెడ్డి ఆధిక్యం సాధిస్తూనే ఉన్నారు. ఉత్కంఠగా సాగిన లెక్కింపులో రెండో ప్రాధాన్యత ఓట్లతో అంజిరెడ్డి విజయాన్ని దక్కించుకున్నారు. అంజిరెడ్డికి 78,635 ఓట్లు రాగా.. సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి 73,644 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న

- మిగతా 2 లో

ఇదీ లోకం!

హస్తినలో వెల్లివిరిసిన

తెలంగాణ సంస్కృతి శోభ

రాష్ట్రపతి భవన్‌లో 'వైవిధ్యతా అమృత్ ఉత్సవ్'

విశాలాంధ్ర – హైదరాబాద్: హస్తినలో తెలంగాణ సంస్కృతి శోభ వెల్లివిరిసింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ... రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యాన్‌లో ఏర్పాటు చేసిన "వైవిధ్యతా అమృత్ ఉత్సవ్" ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. తొలుత రాష్ట్రపతి అన్ని రాష్ట్రాల స్టాళ్లను సందర్శించారు. తెలంగాణ స్టాళ్లకు విచ్చేసిన రాష్ట్రపతిని గవర్నర్, ఉప ముఖ్యమంత్రి సాదరంగా ఆహ్వానించి తెలంగాణ చేనేత కళాకారుల పనితనాన్ని, చేతివృత్తుల

- మిగతా 2 లో

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై

కోర్ కమిటీ భేటీ

విశాలాంధ్ర– హైదరాబాద్: ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కోర్ కమిటీ భేటీ అయింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. గంటకుపైగా కొనసాగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈనెల 29న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ ఏర్పడుతున్నాయి. వాటిని భర్తీ చేసేందుకు

- మిగతా 2 లో

బీఆర్ఎస్ పాలనలోనే నీటి సంక్షోభం

హరీశ్‌వి అసత్య ఆరోపణలు: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర – హైదరాబాద్: తెలంగాణా రాష్ట్రంలో నీటి సంక్షోభానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకు పోవడం గత పాలకులు అవలంభించిన ఉదాసీనతే కారణమని ఆయన మండిపడ్డారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా ఇష్టాగోష్ఠిగా ఆయన మాట్లాడారు. కృష్ణా జలాశయాల అంశంలో తెలంగాణాకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం రూపొందించిన నియమావళిని సరి దిద్దిందన్నారు. చేసినంత చేసి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణలు చేయడం అర్ధరహితమని,ఆయన ఆరోపణలు పూర్తిగా అసత్యమని ఉత్తమ్ పేర్కొన్నారు. సరైన పద్ధతిలో నీరు అందించినందునే ఖరీఫ్ సీజన్‌లో

- మిగతా 2 లో



గ్రూప్-1 పోస్టులపై తప్పుడు ప్రచారం

పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్- 1 ఉద్యోగాలపై తప్పుడు వార్తలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఖండించింది. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతి త్వరలోనే గ్రూప్- 1 ఫలితాలు వెల్లడిస్తామని తెలిపింది. మార్కుల జాబితాను వెబ్‌సైట్‌లో పెడతామని...

- మిగతా 2 లో

కొందరు బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలు

మంత్రి సీతక్క

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతో అధికారంలోకి వచ్చిందని మంత్రి సీతక్క అన్నారు. కొందరు బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తీన్మార్ మల్లన్న

- మిగతా 2 లో

'చండీగఢ్ చలో'కు విఘాతం

రైతులను ఎక్కడికక్కడ ఆపేసిన పోలీసులు

వందల మంది అరెస్టు - రోడ్లపైనే బైఠాయించి నిరసన తెలిపిన అన్నదాతలు

చండీగఢ్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు 'చండీగఢ్ చలో'ను పంజాబ్ రైతులు బుధవారం చేపట్టారు. చండీగఢ్‌కు కదం తొక్కారు. దీంతో రాజధాని నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసులను భారీగా మోహరించారు. బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. రైతులను చండీగఢ్‌కు వెళ్లనివ్వకుండా పోలీసులు వారిని ఎక్కడికక్కడే ఆపేశారు. వందల మందిని నిర్బంధించారు. దీంతో పంజాబ్‌లోని 25కుపైగా స్థానాల్లో రైతుల ధర్నాలు జరిగాయి. అరెస్టైన వారిలో బీకేయూ ఉగ్రాహన్ అధ్యక్షుడు జోగిందర్ సింగ్ ఉగ్రహన్, బీకేయూ రాజేవాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముకేశ్ చంద్ర శర్మ, బీకేయూ షాదిపూర్ అధ్యక్షుడు బూటా సింగ్ షాదిపూర్ తదితరులు ఉన్నారు. ఉగ్రహాన్, ఆయన మద్దతుదారులను పోలీసులు సంగ్రూర్‌లోని ఛజిలి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సంగ్రూర్, మాన్సా, బర్నాలా, భటిండా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు రోడ్లపైనే బైఠాయించారు. ధర్నాలు చేశారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితి... వందల మంది అరెస్టుల వేళ మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. సీఎం భగవత్ మాన్ ఉత్తర్వులను ధిక్కరించారు. తమను చండీగఢ్‌కు వెళ్లనివ్వకపోవడంతో సీఎంకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ట్రాక్టర్-ట్రాలీలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో చండీగఢ్‌కు బయల్దేరిన రైతులను పంజాబ్ పోలీసులు ఎక్కడికక్కడే నిలువరించారు. కాంత్రికారీ కిసాన్ యూనియన్ మోగా జిల్లా అధ్యక్షుడు జతిందర్

- మిగతా 2 లో

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన

దేశ సమైక్యతకు ముప్పు

- హిందీయేతర రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిస్తుంది
- కేంద్రం 1971 జనాభా లెక్కలకు కట్టుబడి ఉండాలి
- తమిళనాడు అఖిలపక్షం ఏకగ్రీవ తీర్మానం
- సంయుక్త కార్యాచరణ కమిటీ ఏర్పాటు

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం 2026లో జరగనున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియను ఏకగ్రీవంగా తిరస్కరించింది. 'డీలిమిటేషన్ తమిళనాడును బలహీనపరుస్తుంది. భారతదేశ సమాఖ్య నిర్మాణానికి ముప్పు' అవుతుందని పేర్కొంది. పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన, భాష అంశాలపై బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నాయకత్వం వహించారు. భవిష్యత్‌లో జరిగే ఏదైనా నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం 1971 జనాభా లెక్కలకు కట్టుబడి ఉండాలనే డిమాండ్‌తో సహా ఐదు తీర్మానాలను సమావే శంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. స్టాలిన్ మాట్లాడుతూ... అఖిలపక్ష సమావేశం డీలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకించలేదని, పరిగణనలోకి తీసుకుంటున్న పద్ధతిని వ్యతిరేకిస్తున్నట్లు పునరుద్ఘాటించారు. తమిళనాడు, ఇతర దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో కూడిన సంయుక్త కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మద్దతును సమీకరించడానికి, నిరసనలు తెలియజేయడానికి, పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించిన పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి కమిటీ పని చేస్తుంది. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష

- మిగతా 2 లో

2 రోప్‌వేలకు

కేంద్రం ఓకే

- పశువుల వ్యాధి నిరోధానికి కేటాయింపులు
- 3 ప్రాజెక్టుల కోసం రూ.10.691 కోట్లకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌కు రెండు రోప్ వేలను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. పశువుల ఆరోగ్యం, వ్యాధుల నియంత్రణ (ఎల్‌హెచ్‌డీసీపీ), పర్వతమాలా పరియోజన కోసం కేటాయింపులకూ అంగీకరించింది. మతపరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించేలా నిర్ణయాలు తీసుకుంది. మొత్తం మూడు ప్రాజెక్టుల కోసం రూ.10,691 కోట్లను ప్రధాని మోదీ అధ్యక్షత బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశం ఆమోదించింది. రూ.4,081.28 కోట్ల అంచనా వ్యయంతోఉత్తరాఖండ్‌లో సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్ వరకు రోప్ వే ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. మొత్తం 12.9 కిమీల రోప్‌వేను ప్రభుత్వ-

- మిగతా 2 లో

పెరుగుతున్న కోటీశ్వరులు

- 2024లో ఆరు శాతం వృద్ధి
- 191కు చేరిన బిలియనీర్లు
- ఏడాదిలోనే జాబితాలోకి 26 మంది
- ది వెల్త్ రిపోర్ట్-2025లో వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌లో కోటీశ్వరులు క్రమంగా పెరుగుతున్నారు. ఏటేటా వీరి సంఖ్యలో వృద్ధి నమోదవుతోంది. ఈ మేరకు ది వెల్త్ రిపోర్ట్ 2025 తెలిపింది. 2024లో కోటీశ్వరుల సంఖ్యలో ఆరు శాతం వృద్ధి నమోదు కాగా బిలియన్లు 191కు పెరిగినట్లు వెల్లడించింది. గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్‌టెంట్ నైట్ ఫ్రాంక్ అధ్వర్యంలో ఈ అధ్యయనం జరిగింది. హైనెట్ వర్త్ (హెచ్‌ఎన్‌డబ్ల్యూ) వ్యక్తులు అంటే 10 మిలియన్ల (కోటికిపైగా ఆస్తిగలవారు) గతేదాది ఆరు శాతం పెరిగి 85,698కు చేరినట్లు బుధవారం విడుదలైన రిపోర్టు తెలిపింది. అంతకుముందు సంవత్సరం ఈ సంఖ్య 80,686గా

- మిగతా 2 లో

నిధుల సమీకరణకు భూములమ్మడం

దివాలాకోరుతనమే

- నాడు వద్దని రేవంత్ సుద్దులు... నేడు టెండర్లు
- ఆదాయ సముపార్జనలో సర్కార్ విఫలం: కేటీఆర్ ధ్వజం

విశాలాంధ్ర – హైదరాబాద్: భూములు అమ్మితే కాని ప్రభుత్వాన్ని నడపలేని స్థితికి తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 30 వేల కోట్ల నిధుల సమీకరణకు తాజాగా హైదరాబాద్‌లోని విలువైన భూములను అడ్డికిపావుశేరు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బ్యాంకులో తనఖా పెట్టిన భూములనే వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిదర్శనం అన్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగపల్లి మండలం కంచగచ్చిబౌలి పరిధిలో ఉన్న 400 ఎకరాలను అమ్మడం లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన రేవంత్, ఊసరవెల్లి కంటే వేగంగా మాట మార్చారని కేటీఆర్ మండిపడ్డారు. అసెంబ్లీని మోసం చేసిన రేవంత్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైడ్రా, మూసీ కూల్చివేతల వంటి తలాతోకలేని విధానాలతో రాష్ట్ర ఆదాయం తగ్గి ప్రభుత్వ భూములను అమ్ముకుంటే కాని ఆదాయం సమకూర్చుకోలేని స్థాయికి రేవంత్ సర్కార్ దిగజారిందని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులతో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులు, పేదలను ఆదుకున్నామని కేటీఆర్ చెప్పారు. 70 లక్షల మంది రైతులకు రైతు బంధు కింద రూ.73 వేల కోట్లు, రూ.28 వేల కోట్ల రుణమాఫీ, రూ.ఆరు వేల కోట్లతో రైతు బీమా, లక్ష 11 వేల కుటుంబాలకు రూ.ఐదు లక్షల పరిహారాన్ని తమ ప్రభుత్వం అందించిందన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం,

- మిగతా 2 లో

కార్మికోద్యమ కాగడా ఎ.ఐ.టి.యు.సి.

ప్రస్తుతం సి.పి.ఐ. భావజాలానికి దగ్గరగా ఉన్న అనేక ప్రజాసంఘాలలాగే కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించే అఖిలభారత ట్రేడ్ యునియన్ కాంగ్రెస్ (ఎ.ఐ.టి.యు.సి.) కమ్యూనిస్టు పార్టీకన్నా ముందే 1920 అక్టోబర్ 31న ఏర్పడింది. లాలా లజపతి రాయ్ ఎ.ఐ.టి.యు.సి. మొదటి అధ్యక్షుడిగా ఉన్నారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

భారత్, చైనాపై ప్రతీకార సుంకాలు

ఏప్రిల్ 2 నుంచి అమలు - అమెరికా కాంగ్రెస్‌లో ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్: సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూకుడు కొనసాగిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటిగా దేశాలపై సుంకాలను ప్రకటిస్తున్నారు. తాజాగా భారత్‌పైనా సుంకాలు అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి భారత్, చైనా మీద ప్రతీకార సుంకాలు అమలు చేస్తామని అమెరికా కాంగ్రెస్‌లో ట్రంప్ వెల్లడించారు. భారత్, ఇతర దేశాలు అధిక సుంకాలు వసూలు చేస్తున్నాయని, ఇది చాలా అన్యాయమని అన్నారు. అమెరికా వస్తువులపై సుంకాలు విధించే అన్ని దేశాలపై ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రతీకార సుంకాలు అమలు చేయబోతున్నట్లు అమెరికా కాంగ్రెస్ ఉమ్మడి సమావేశంలో ట్రంప్ ప్రకటించారు. 'మీరు మీ ఉత్పత్తులను అమెరికాలో తయారు చేయకపోతే టారిఫ్‌లు తప్పవు. కొన్ని సందర్భాల్లో ఎక్కువే చెల్లించాల్సి వస్తుంది' అని అన్నారు. దశాబ్దాలుగా అమెరికాపై ఇతర దేశాలు సుంకాలు విధిస్తున్నాయని, ఇక తమ వంతు వచ్చిందన్నారు. యూరోపియన్ యూనియన్, చైనా, బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు భారీ సుంకాలు విధిస్తున్నాయని, ఇది చాలా అన్యాయమని ఆయనన్నారు. భారత్ 100శాతానికి పైగా ఆటో టారిఫ్‌లు విధించిందని తెలిపారు. అమెరికా విధించే దాని కంటే చైనా రెట్టింపు వసూలు చేస్తోందని, దక్షిణ కొరియా ఏకంగా నాలుగు రెట్లు అధికంగా టారిఫ్ అమలు చేస్తోందన్నారు. దక్షిణ కొరియాకు సైనికపరంగానే కాకుండా ఇతర విధాలా సహాయ సహకారాలను అమెరికా అందిస్తున్నప్పటికీ ఈ పరిస్థితి ఉందని చెప్పారు. 'భూమి మీద ఉన్న ప్రతి ఒక్క దేశం దశాబ్దాలుగా మనల్ని పిండేస్తోంది. ఇక అలా జరగనివ్వం. ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు అమలు చేస్తాం. మిగతా దేశాలు మనపై ఏ మేరకు సుంకాలు విధిస్తే... అంతేస్థాయిలో వారి నుంచి మనం వసూలు చేద్దాం' అని రిపబ్లికన్ సభ్యుల హర్షధ్వనుల మధ్య ట్రంప్ ఉద్ఘాటించారు. 'వారు మనల్ని వారి మార్కెట్‌లోకి రానివ్వరు... మనం ట్రిలియన్లు... ట్రిలియన్ల డాలర్లు తీసుకుందాం. ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు సృష్టించుకుందాం' అని ఆయనన్నారు. ప్రతీకార సుంకాలు ద్వారా అమెరికా సుసంపన్నం కాగలదని ట్రంప్ ఆకాంక్షించారు.

ఎలాగైనా గ్రీన్‌ల్యాండ్‌ను చేజిక్కించుకుంటాం...

గ్రీన్‌ల్యాండ్‌ను ఏదో ఒక విధంగా చేజిక్కించుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు ట్రంప్ వెల్లడించారు. గ్రీన్‌ల్యాండ్ అమెరికా వశమైతే ఆ ద్వీప ప్రజలను సంపన్నులుగా మారుస్తామని చెప్పారు. 'మీకు రక్షణ ఇస్తాం. ధనవంతులుగా మారుస్తాం. ఐక్యతకు హామీనిస్తాం. గ్రీన్‌ల్యాండ్ ఊహించని రీతిలో పురోగతి సాధించేలా చేస్తాం' అని గ్రీన్‌ల్యాండ్ ప్రజలనుద్దేశించి ట్రంప్ అన్నారు. గ్రీన్‌ల్యాండ్ జనభా తక్కువ... భూమి ఎక్కువని, ఇది సైనిక భద్రతకు కీలకమన్నారు. అంతర్జాతీయ ప్రపంచ భద్రతకు గ్రీన్‌ల్యాండ్ మనకు కావాలని ట్రంప్ చెప్పుకొచ్చారు. 'మీరు ఒప్పుకుంటే అమెరికాలోకి స్వాగతిస్తాం. మీ భవిష్యత్ ఆకాంక్షలకు సంపూర్ణ మద్దతు ఇస్తాం' అని ట్రంప్ అన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను ఎలాగైనా సొంతం చేసుకుంటామని, ఇందుకోసం అన్ని విధాలా యత్నిస్తున్నామని చెప్పారు. ట్రంప్ ప్రతిపాదనకు గ్రీన్‌ల్యాండ్ ప్రజలు వ్యతిరేకమని ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడైంది.

అమెరికా ఈజ్ బ్యాక్...

దశాబ్దాల్లో ఎన్నడూ చూడని విధంగా అధ్యక్ష ఎన్నికలు జరిగాయని తన విజయాన్ని ఉద్దేశించి ట్రంప్ అన్నారు. 'అమెరికా ఈస్ బ్యాక్' అని నినాదమిచ్చారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ తిరిగొచ్చిందన్నారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆరు వారాల్లో 100 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో 400 కార్యనిర్వాహక చర్యలు కూడా చేపట్టానని ట్రంప్ చెప్పారు. డోజ్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ను, తన భార్య మెలేనియాను ట్రంప్ మెచ్చుకున్నారు. గొప్ప ఉద్దేశంతో ఏర్పాటు చేసిన డోజ్ కోసం మస్క్ చాలా కష్టపడుతున్నారని అన్నారు. ఆన్‌లైన్‌లో అశ్లీలతను అడ్డుకునేలా బిల్లు తేవడంతో చాలా కృషి చేశారంటూ మెలేనియాను మెచ్చుకున్నారు. ఈ బిల్లును సెనెట్ ఆమోదించినందుకు ట్రంప్ ధన్యవాదాలు తెలిపారు. దీంతో రిపబ్లికన్ సభ్యులంతా తమ స్థానాల్లో నుంచి లేచి నిలబడి చప్పట్లతో మస్క్, మెలేనియాను అభినందించారు.

శాంతికి రష్యా... చర్చలకు ఉక్రెయిన్ సిద్ధం

శాంతికి రష్యా సిద్ధంగా ఉన్నట్లు బలమైన సంకేతాలు అందాయని ట్రంప్ అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ నుంచి ఓ లేఖ అందిందని, దాని ప్రకారం వారు చర్చలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఖనిజాలు-భద్రతా ఒప్పందంపై సంతకాలకూ ఉక్రెయిన్ సిద్ధమేనని ట్రంప్ చెప్పారు. 'ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని ముగించేందుకు నిర్విరామంగా పనిచేస్తున్నా. ఈ యుద్ధంలో భారీగా ప్రాణ నష్టం జరిగింది' అని అన్నారు. 'ఉక్రెయిన్ ప్రజల కంటే ఎక్కువగా శాంతిని కోరుకునే వారు ఉండరు... శాంతి చర్చలకు సిద్ధమంటూ' జెలెన్‌స్కీ నుంచి తనకు లేఖ అందిందని ట్రంప్ చెప్పారు. అమెరికా చేసిన సహాయానికి రుణపడి ఉంటామని కూడా జెలెన్‌స్కీ పేర్కొన్నారన్నారు. ఖనిజాలు-భద్రతా ఒప్పందంపై ఎప్పుడైనా సంకతం చేసేందుకు ఉక్రెయిన్ సిద్ధమని ట్రంప్ చెప్పారు. అటు రష్యాతోనూ సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు. రష్యా కూడా శాంతికి కట్టుబడి ఉందన్నారు. 'మారణహోమం ఆగితే బాగుంటుందని... అర్థంలేని ఈ యుద్ధంతో భారీగా ప్రాణ నష్టం జరిగింది. యుద్ధాలు ఆపాలంటే రెండు వర్గాలతో సంప్రదింపులు జరపాలి' అని ట్రంప్ అన్నారు.

డెమొక్రాట్ల వాకౌట్...

ట్రంప్ ప్రసంగాన్ని డెమొక్రాట్లు అడ్డుకున్నారు. 'నో కింగ్' (మీరేమి రాజు కాదు), 'సేవ్ మెడిక్ ఎయిడ్' (వైద్య సహాయాన్ని పరిరక్షించాలి) వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలో రిపబ్లికన్లకు డెమొక్రాట్లు వీపు చూపారు. ట్రంప్ అభిశంసన కోసం ప్రతిపాదించాలనుకున్న డెమొక్రాట్, అల్ గ్రీన్ ఆఫ్ టెక్సాస్ ప్రతినిధి... సభను అడ్డుకున్నారు.

ట్రంప్ ప్రసంగించడం మొదలు పెట్టినప్పుడు బిగ్గరగా అరిచారు. దీంతో స్పీకర్ మైక్ జాన్సన్ ఆయనను సభ నుంచి బయటకు పంపాలని ఆదేశాలివ్వగా రిపబ్లికన్లు హర్షం వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రశంసం మొదలు పెట్టినప్పుడు డెమొక్రాట్లు చాలా మంది వాకౌట్ చేశారు. వారి ఆందోళనలను ట్రంప్ తోసిపుచ్చారు. 'నా ముందరున్న డెమొక్రాట్లను సంతోషపెట్టేందుకు నేను చేయగలిగినది ఏమీ లేదు. ఇక్కడ కూర్చున్న వారెవ్వరూ చప్పట్లు కొట్టరు. లేని నిలబడరు. గొప్ప విజయాలను మెచ్చుకోరు' అని డెమొక్రాట్లనుద్దేశించి ట్రంప్ అన్నారు.

'చండీగఢ్ చలో'కు విఘాతం

(మొదటిపేజీ తరువాయి)

సింగ్‌ను అజిత్వాల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. సంరాలా, పాటియా లాలోనూ రైతులను ఆపేశారు. చెక్ పాయింట్ వద్ద 100 మంది పోలీసులను మోహరించి, చండీగఢ్ వైపునకు వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయిస్తున్నట్లు సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. చండీగఢ్-మొహాలీ సరిహద్దు పాయింట్ల వద్ద బారికేడ్లను చండీగఢ్ పోలీసులు ఏర్పాటు చేశారు. ఘర్షణల నివారణకు యాంటీ-రయట్ వాహనాలను సిద్ధం చేశారు. అలాగే అంబులెన్సులు, అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచినట్లు ఓ అధికారి వెల్లడించారు.

పెరుగుతున్న కోటీశ్వరులు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు పేర్కొంది. 2028 నాటికి 93,753 మంది కోటీశ్వరులు ఉంటారని అంచనా వేసింది. పెరుగుతున్న సంపన్నుల సంఖ్య... దేశ దీర్ఘకాల ఆర్థిక వృద్ధికి, పెరుగుతున్న పెట్టుబడుల అవకాశాలకు, విలాసాల విపణి వ్యాప్తికి, ప్రపంచ సంపద సృష్టిలో భారత కీలక పాత్రకు సంకేతామని అధ్యయనకర్తలు వెల్లడించారు. ఇక బిలియనీర్ల విషయానికొస్తే 2024లో వీరి సంఖ్య 191కు పెరిగిందని, కేవలం ఒక సంవత్సరంలోనే 26 మంది ఈ జాబితాలో చేరారని నివేదిక తెలిపింది. 2019లో ఏడుగురు బిలియనీర్ల జాబితాలో చేరినట్లు పేర్కొంది. భారతీయ బిలియనీర్ల ఆస్తి మొత్తం కలిపితే 950 బిలియన్ డాలర్లు అవుతుంది. అంటే ప్రపంచ దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలుస్తుంది. మొదటి రెండుస్థానాల్లో 5.7 ట్రిలియన్ల డాలర్లతో అమెరికా, 1.34 ట్రిలియన్ల డాలర్లతో చైనా ఉన్నాయి. ఎంట్రప్రెన్యూర్ డైనమిజంతో సంపన్నులు పెరుగుతున్నట్లు నైట్ ఫ్రాంక్ చైర్మన్, ఎండీ శిశిర్ బైజల్ అన్నారు. రాబోయే దశబ్ద కాలంలో ప్రపంచ సంపద సృష్టిపై భారత్ ప్రభావం గణనీయంగా ఉండబోతోందని వెల్లడించారు.

రాహుల్ గాంధీకి రూ.200 జరిమానా

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. దీంతో చరిత్రను రాహుల్ గాంధీవక్రీకరించారని, సావర్కర్ వంటి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుని అగౌరవపరిచారని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ప్రముఖ న్యాయవాది నృపేంద్ర పాండే కోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం లక్నో కోర్టు రాహుల్‌కు సమన్లు పంపింది. 2025 జనవరి10న కోర్టు ముందు హాజరు కావాలని లక్నో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశించారు. అయితే రాహుల్ హాజరు కాలేదు. దీంతో సీరియస్ అయిన కోర్టు.. రాహుల్ గాంధీకి రూ.200 జరిమానా విధిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టుకు హాజరు కావాలని మరోసారి నోటీసులు సైతం జారీ చేసింది.

కొందరు బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలపై స్పందించిన సీతక్క... కులగణనపై అభ్యంతరాలు ఉంటే శాసనమండలిలో మాట్లాడొచ్చని సూచించారు. బీఆర్ఎస్ చేయలేనిది తాము చేశామని అభినందించాల్సింది పోయి విమర్శిస్తారా అని అగ్రహం వ్యక్తం చేశారు. తీన్మార్ మల్లన్న బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కులగణన సర్వేపై విమర్శలు చేశారు. తనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినప్పటికీ బీసీ ఉద్యమం ఆగదని అన్నారు. 'కులగణన దేశానికి ఆదర్శంగా ఉండాలి... రాహుల్ గాంధీ తలెత్తుకుని తిరగాలని ఆశించాను. నూటికి నూరు శాతం పారదర్శకంగా సర్వే చేస్తేనే ఆదర్శంగా ఉంటుంది. అగ్రవర్ణాలను ఎక్కువగా చూపించి.. బీసీ వర్గాలను అణచిపెట్టే ప్రయత్నం చేశారు. నేను మాట్లాడింది తప్పు అయితే... మళ్లీ కులగణనకు ఎందుకు సమయం ఇచ్చారు అని ప్రశ్నించారు. బీసీ నేతలు కష్టపడితేనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది' అని మల్లన్న అన్నారు.

దివాలాకోరుతనమే

(మొదటిపేజీ తరువాయి)

పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్ సాగునీటి ప్రాజెక్టులు, 45 వేల చెరువుల పునరుద్ధరణ, 45 లక్షల మందికి ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్ కాలేజీలను ప్రారంభించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తోందని గతంలో అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి అయిన మరుక్షణం నుంచి అప్పు చేయడాన్నే పరమా వధిగా పెట్టుకున్నారని అన్నారు. కేవలం 15 నెలల పాలనలోనే లక్షా 65 వేల కోట్ల పైచిలుకు అప్పు చేశారని ఆరోపించారు. రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా పథకాలను ఎగ్గొట్టి, విద్యుత్ కోతలు విధించి, గురుకులాలను నిర్వీర్యం చేసి, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పడావు పెట్టి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన రాహిత్యంతో శ్రీశైలం సొరంగాన్ని కుప్పకూల్చి ఎనిమిది మంది ప్రాణాలు బలితీసుకున్న బాధ్యతలేని ప్రభుత్వం రేవంత్ ది అని మండిపడ్డారు. గల్లీలో గాలిమాటలు మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, ఢిల్లీకి మాత్రం ధనం మూటలు మోయడాన్నే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో దేశానికే రోల్ మోడల్ గా నిలిచిన తెలంగాణ ప్రగతిని అనతి కాలంలోనే తిరోగమనం బాట పట్టించిన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ అని కేటీఆర్ మండిపడ్డారు.

దేశ సమైక్యతకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

కాకూడదన్నారు. 39 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్న రాష్ట్రం స్వరాన్ని కేంద్రం పట్టించుకోలేదని, ఈ సంఖ్య తగ్గితే, అది రాష్ట్రానికి పెద్ద అన్యాయంగా మారుతుందని తెలిపారు. 'డీలిమిటేషన్ కత్తి దక్షిణ భారతదేశం తలపై వేలాడుతోంది, తమిళనాడు తీవ్రంగా ప్రభావితమవుతుంది' అని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని తమిళనాడు హక్కుల కోసం పోరాటం అని అభివర్ణించారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన ప్రక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

55 పార్టీలు... సంస్థలు హాజరు

తమిళనాడు సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో 55 కి పైగా రాజకీయ పార్టీలు, సంస్థలు పాల్గొన్నాయి. ఏఐఏడీఎంకేకు చెందిన డి.జయకుమార్, కాంగ్రెస్ నాయకుడు సెల్వపెరుంతగై, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, సీపీఎంకు చెందిన షణ్ముగం, వీసీకే నుంచి తిరుమావళవన్, ఎండీఎంకే నేత వైకో, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి, ద్రవిడర్ కజగంకి చెందిన వీరమణి ఉన్నారు. అయితే బీజేపీ, తమిళ మనీలా కాంగ్రెస్, నామ్ తమిళర్ కట్చి పార్టీలు హాజరు కాకూడదని నిర్ణయించుకున్నాయి.

హిందీయేతర రాష్ట్రాలకు ప్రమాదం : కమల్ హాసన్

అఖిలపక్ష సమావేశంలో మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్‌హాసన్ మాట్లాడుతూ... ఇండియాను 'హిందీయా'గా మార్చే ప్రయత్నం జరుగుతోందని కేంద్రంపై విమర్శలు చేశారు. "అన్ని రాష్ట్రాలు హిందీలో మాట్లాడేలా చేసి, ఎన్నికల్లో మెజార్టీ సాధించాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. మనం ఇండియా గురించి ఆలోచిస్తుంటే.. వారు మాత్రం హిందీయా కలలుకంటున్నారు" అని కమల్ హాసన్ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటరీ నియోజకవర్గాల డీలిమిటేషన్ కోసం కేంద్రం చేసిన ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని, దేశ వైవిధ్యాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, కేరళ, పంజాబ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలతో సహా తమిళనాడుకు వెలుపల అనేక రాష్ట్రాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని చెప్పారు. జనాభా పెరుగుదలను విజయవంతంగా నియంత్రించే రాష్ట్రాలను శిక్షించకూడదనే తన వైఖరిని పునరుద్ఘాటించారు. 1976, 2001లో మాజీ ప్రధానులు తీసుకున్న నిర్ణయాలను ఆయన ఉదహరించారు.

పునర్విభజన అంగీకరించం:టీవీకే అధినేత విజయ్

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుందని... దీన్ని అంగీకరించమని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఆయా రాష్ట్రాలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ఈ విభజన ప్రక్రియ తాజా జనాభా లెక్కల ఆధారంగా ఉంటే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంది. దీన్ని ఏమాత్రం అంగీకరించం. గత 50 ఏళ్లుగా తమిళనాడుతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలు జనాభా పెరుగుదలను నియంత్రించాయి.

ఈక్రమంలో ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలు విభజించడం సరికాదు. ఒకరి గెలుపు కోసం ఇంకొకరిని శిక్షించడం అన్యాయం. దక్షిణాది రాష్ట్రాల్లోని నియోజకవర్గాల సంఖ్య తగ్గినా.. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఆ సంఖ్య పెరిగినా సహించేది లేదు. అన్ని పార్టీలతో కలిసి దీనిపై పోరాడతాం. ప్రజాప్రతినిధుల కొరత సాధారణ ప్రజలకు సమస్యే కాదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నాణ్యమైన విద్య, వైద్యం, రోడ్లు వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముందు వాటిపై దృష్టి సారించాలి' అని ప్రకటనలో పేర్కొన్నారు.

'రాజధాని'పై రసాభాస

- ఎమ్మెల్సీ పండుగుల వ్యాఖ్యల దుమారం
- అమరావతిపై విషం చిమ్ముతారా?
- ఏపీ మండలిలో వైసీపీపై మంత్రుల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శాసన మండలిలో రాజధాని అమరావతి అంశం రసాభాసగా మారింది. శాసన మండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల అనంతరం చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు బడ్జెట్‌పై ప్రసంగాలకు అనుమతించారు. బడ్జెట్ కేటాయింపులపై వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. రాజధానిగా అమరావతి నిర్ణయం, అభివృద్ధిపై ఆయన తీవ్ర అభ్యంతరకర వాఖ్యలు చేశారు. కాగా రాజధానిని ఘోస్ట్ సిటీతో పోల్చడాన్ని మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి, అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ మధ్యలో రాజధాని అమరావతి నగరం ఉంటుందని కొందరు చెబుతున్నారని, ఆస్ట్రిచ్ పక్షిలాగా ఎందుకు లేనిపోనివన్నీ పెట్టుకుంటారని, అమరావతి నగరాన్ని కట్టలేరని, అది సాధ్యం కాదని, నగరాలను నిర్మించలేం... వాటంతట అవే అభివృద్ధి చెందాలని పండుగల రవీంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేయగా... దానికి మంత్రులు ఘాటుగా సమాధానం ఇచ్చారు. రాజధానిపై వైసీపీ నేతలు విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. దీంతో ఒక్కసారిగా మండలిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తొలుత పండుగల రవీంద్రబాబు మాట్లాడుతూ, అమరావతి అనేది ఇటుకలు, సిమెంట్‌తో కట్టేది కాదని, కొత్తగా నగరాలను కట్టడం అనేది సాధ్యం కాదన్నారు. ఒకప్పుడు బర్మా దేశం క్యాపిటల్‌ను కట్టుకుందని, ఇప్పుడు అక్కడ బిల్డింగులే తప్ప మనుషులు లేరన్నారు. బర్మా దేశం రాజధానిని ఘోస్ట్ సిటీ అంటున్నారని వ్యాఖ్యానించారు. వైసీపీకి అమరావతి రాజధానిగా అంగీకారం కాదని, అమరావతికి ఎవరైనా పారిశ్రామికవేత్తలు వస్తారా? అని ప్రశ్నించారు.

రాజధానిపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: అచ్చెన్నాయుడు, కొల్లు, పార్థసారథి

పండుగుల రవీంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు సభలో ఉన్న మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి, అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజధాని గురించి మాట్లాడే అర్హత వైసీపీ సభ్యులకు లేదంటూ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాష్ట్ర ప్రజలు రాజధానిపై ఎన్నికల్లో స్పష్టమైన తీర్పునిచ్చారని, మూడు రాజధానులన్న వైసీపీకి ఏ తీర్పునిచ్చారో తెలుసంటూ ఎద్దేవా చేశారు. అమరావతే ఏకైక రాజధాని అని, ఎన్నికలకు వెళ్తే ప్రజలు కూటమికే పట్టం కట్టారని గుర్తుచేశారు. రాజధాని అమరావతిని ముఖ్యమంత్రి చంద్రబాబు అద్భుతంగా నిర్మిస్తారని, సీఎం విజన్ ఏంటో తాము చేసి చూపిస్తామని గట్టిగా సమాధానం ఇచ్చారు. రాజధాని అమరావతిపై వైసీపీ నేతలు అవకాశం దొరికినప్పుడల్లా విషం చిమ్ముతున్నారని, ఆ పార్టీ నేతలు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో అధికారులు ఉండేందుకుగాను రాజధానిలో వసతులు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. వైసీపీ నేతలంతా మనుషుల మధ్య నుంచే అమరావతికి వస్తున్నారనే విషయం తెలుసుకోవాలంటూ మంత్రి చురకలు అంటించారు. వైసీపీ నేతలు అమరావతి వద్దు..మూడు రాజధానులే ముద్దంటూ ఎన్నికలకు వెళ్లారని, అప్పుడు ఏం జరిగింతో అందరికీ తెలుసంటూ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం

(మొదటిపేజీ తరువాయి)

హరికృష్ణ మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ఒక వైపు కౌంటింగ్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుండగానే కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోయారు. తెలంగాణలో కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ మూడు రోజులపాటు సాగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో విజయం దోబూచులాడి చివరకు బీజేపీ అభ్యర్థిని వరించింది. మరోవైపు ఇప్పటికే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించారు. మొత్తం 25,041 ఓట్లు పోలవ్వగా, అందులో 897 ఓట్లు చెల్లుబాటు కాలేదు. మొత్తం చెల్లుబాటు అయిన 24,144 ఓట్లలో బీజేపీ అభ్యర్థి కొమురయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి. ఇక పీఆర్టీయూ అభ్యర్థి మహేందర్ రెడ్డి 7,182 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఇక అశోక్ కుమారు 2,621 ఓట్లు వచ్చాయి. దీంతో వరుస విజయాలతో తెలంగాణలో బీజేపీ శ్రేణులు ఆనందోత్సాహాల్లో మునిగితేలుతున్నారు.

రేపు ఢిల్లీకి రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

చర్చించి... అభ్యర్థులను ఖరారు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పీసీసీ వర్గాలు పేర్కొంటు న్నాయి. ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ఇప్పటికే రేవంత్ రెడ్డి కోర్ కమిటీతో సమావేశమ య్యారు. అభ్యర్థుల ఎంపిక కోసం అనుసరించే విధి విధానాలపై గంట పాటు చర్చించారు. సామాజిక వర్గాల వారీగా సమతుల్యత పాటించేలా అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసి ఏఐసీసీకి ఇవ్వనున్నారు. ఈ జాబితాను పరిశీలించిన తర్వాత అభ్యర్థుల ఎంపికపై ఏఐసీసీ నిర్ణయిస్తుంది.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కోర్ కమిటీ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 10 వరకు నామినేషన్‌లు దాఖలు చేసుకోవడానికి గడువు విధించింది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీఆర్ఎస్‌కు, మిగిలినవి కాంగ్రెస్ పార్టీకి దక్కను న్నాయి. ఈ నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పీసీసీ కోర్ కమిటీ కసరత్తు మొదలు పెట్టింది. అందులో భాగంగానే రేవంత్ రెడ్డితో సమావేశం నిర్వహించారు. మరోసారి సమావేశం కావాలని పీసీసీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవులు కోసం పీసీసీకి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందినట్లు విశ్వసనీయ సమాచారం.

---

2 రోప్‌వేలకు కేంద్రం ఓకే

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మిస్తారు. ఈ మేరకు కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. బిల్ట్ ఆన్ ఎ డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌ఓటీ) నమూనా ఆధారంగా అధునాతన ట్రై-కేబుల్ డిటాచబుల్ గొండాలా (3ఎస్) సాంకేతికతను వినియోగించి రోప్‌వే నిర్మిస్తారన్నారు. గంటకు 1,800 మంది చొప్పున భక్తులు ప్రయాణించేలా ట్రై-కేబుల్ డిటాచబుల్ గొండాలాను డిజైన్ చేస్తారని చెప్పారు. దీంతో ప్రయాణ సమయం తొమ్మిది గంటల నుంచి 36 నిమిషాలకు తగ్గుతుందని, ట్రెక్కింగ్ అవసరం ఉండదని అన్నారు. అలాగే, గోవింద్ ఘాట్ నుంచి హేమకుండ్ సాహిబ్‌జీ వరకు 12.4 కిమీల రోప్ వేనూ కేబినెట్ ఆమోదించినట్లు వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,730.13 కోట్లు కాగా ఇంటిగ్రేట్ మోనోకేబుల్ డిటాచబుల్ గోండాలా (ఎండీజీ), ట్రైకేబుల్ డిటాచబుల్ గొండాలా (3ఎస్) సాంకేతిక ఆధారంగా అన్ని కాలాల్లో ప్రయాణానికి అనుకూలంగా రోప్ వే నిర్మాణం జరుగుతుందన్నారు. గంటకు 1,100 మంది చొప్పున ప్రయాణించవచ్చని, 21కిమీలు ట్రెక్కింగ్ అవసరం ఉండదని చెప్పారు. రెండు రోప్‌వేలను ఐదు లేదా ఆరేళ్లలో పూర్తి చేయనున్నట్లు వైష్ణవ్ వెల్లడించారు. మౌలిక రంగ ప్రాజెక్టుల్లో మంచి అనుభవం ఉన్న కంపెనీలకు బిడ్డింగ్‌లో ప్రాధాన్యత లభిస్తుందని చెప్పారు. పర్యావరణానికి అనుకూలంగా, సౌకర్యంగా, వేగంగా అనుసంధానం కోసం ఈ ప్రాజెక్టులు దోహదం కాగలవన్నారు. ఇక పశువుల ఆరోగ్యం, రోగ నిరోధక కార్యక్రమం (ఎల్‌హెచ్‌డీసీపీ) 2024-25, 2025-26 కోసం రూ.3,880 కోట్లను కేబినెట్ ఆమోదించినట్లు వైష్ణవ్ చెప్పారు. అప్‌గేడ్ చేసిన పథకంలో మూడు కీలకాంశాలుగా 'జాతీయ జంతువుల రోగ నిరోధక కార్యక్రమం (ఎన్ఏడీసీపీ), పశువుల ఆరోగ్యం, రోగాల నియంత్రణ (ఎల్‌హెచ్ & డీసీ), కొత్తగా తెచ్చిన పశు ఔషధి ఉంటాయని వైష్ణవ్ వివరించారు. పశువుల మందులను పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలు, సహకార సంఘాల నెట్‌వర్కుల ద్వారా సరసమైన ధరలకు అందుబాటులోకి తెచ్చేలా రూ.75 కోట్ల కేటాయింపునకూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వైష్ణవ్ చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పశువులలో రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా మొబైల్ వెటరినరీ యూనిట్ల విస్తరణ, పశువుల ఆసుపత్రుల నవీకరణకూ సహకారం లభిస్తుందన్నారు.

పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి మెరుగైతే రైతులకు ఆర్థికపరమైన నష్టం తగ్గడమే కాకుండా ఉపాధి కల్పనకు, గ్రామీణ ఎంట్రప్రెన్యూర్‌షిప్‌కు ప్రోత్సాహం లభిస్తుంది. పశువుల్లో నోరు, కాళ్లకు వచ్చే వ్యాధులు (ఎఫ్ఎండీ) రహిత జోన్ల ఏర్పాటునకూ కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంది. తొలి దశలో తొమ్మిది రాష్ట్రాలు... పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ మహారాష్ట్రలో వీటిని ఏర్పాటు చేస్తుంది.

తెలంగాణ సంస్కృతి శోభ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాముఖ్యతను వివరించారు. అగ్గి పెట్టెలో పట్టే విధంగా చేతితో చీర నేసిన సిరిసిల్ల నేతకారుల పనితీరును రాష్ట్రపతి ప్రముఖంగా ప్రశంసించి, నేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉపముఖ్యమంత్రి స్టాళ్లన్నింటినీ కలియతరిగి నిర్వాహకులతో ముచ్చటించారు. అనంతరం ప్రదర్శించిన "గుస్సాడి" నృత్యం చూపరులను ఆకట్టుకుంటుంది. అన్ని దక్షిణాది రాష్ట్రాల గవర్నర్లు, సంబంధిత మంత్రులు హాజరయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ చేపట్టిన "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్"లో భాగంగా గత సంవత్సరం నుంచి భారత రాష్ట్రపతి కార్యాలయ అధ్వర్యంలో వైవిధ్యతా అమృత్ ఉత్సవాలు జరుపుతున్నారు. భారతదేశంలో సాంస్కృతిక, భాషా, సంప్రదాయ వైవిధ్యాన్ని పురస్కరించుకుంటూ "భిన్నత్వంలో ఏకత్వం" అనే స్ఫూర్తిని చాటి చెప్పటమే ఈ కార్యక్రమ లక్ష్యం. అందరికీ ఉచితంగా ప్రవేశం కల్పించారు. ఈ నెల తొమ్మిదో తేదీ వరకు జరగనున్న ఈ ఉత్సవంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం పెవిలియన్ ఏర్పాటు చేసింది. పద్మశ్రీ పురస్కార గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్‌లతో సహా 20మంది వివిధ ప్రాంతాల ప్రముఖ చేనేత కార్మికులు, 20 మంది హస్తకళా నిపుణులచే స్టాళ్లు ఏర్పాటు చేశారు. ముగ్గురు హస్తకళా నిపుణులు స్వయంగా ఆయా వస్తువుల తయారీ పద్ధతిని అతిథులకు చూపించనున్నారు. నోరూరించే విధంగా తెలంగాణ రుచులతో కూడిన ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. అతిథులను అలరించడానికి రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో తెలంగాణ కళా రూపాలైన ఒగ్గు డోలు, పేరిణి, గుస్సాడీ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ పాలనలోనే నీటి సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

సమైక్యాంధ్రలో కుడా సాధ్యం కాని ధాన్యం దిగుబడి ప్రస్తుత ప్రభుత్వంలో తెలంగాణా రాష్ట్రం సాధించిందన్నారు. రబీ పంటకు సాగు నీరు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. అయితే, కృష్ణా , గోదావరి నదీ జలాల విషయంలో మునుపటి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాహక లోపంతో ప్రస్తుతం రైతులకు తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తోందని ఆరోపించారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో నీటి సంక్షోభానికి బీఆర్ఎస్ కారణమని, తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించడంలో విఫలమైన బీఆర్ఎస్ తెలంగాణకు ఒక పెద్ద నష్టంగా పరిణమించిందని విమర్శించారు. మేడిగడ్డ వద్ద భద్రతా చర్యలు తీసుకోకపోతే, మొత్తం గ్రామాలు మునిగిపోవచ్చని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక హెచ్చరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికయినా హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం మానేయాలని మంత్రి హితవుపలికారు.

గ్రూప్- 1 పోస్టులపై తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థుల లాగిన్‌లో పేపర్ల వారీగా మార్కులు ఉంచుతామని పేర్కొంది. గ్రూప్ -1 నియామక ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతోందని తెలిపింది. ఎలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకున్నామని, అభ్యర్థులు తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది.

చర్ల పోలీసుల ఆధ్వర్యంలో

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత ప్రతిభను వెలికి తీసేందుకే చర్ల పోలీసుల ఆధ్వర్యంలో వాలీ బాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్ అన్నారు. బుధవారం ఛత్తీస్గఢ్ రాష్ట్రం సరి హద్దు ఏజెన్సీలోని వున్న చర్ల మండల స్థాయిలో ఈ పోటీలు నిర్వహిం చారు. అనేక గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ఆదివాసి క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే యువత కోసం చేపట్టిన ఈ పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పంకజ్ పరితోష్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్ పాల్గొన్నారు. 49 గ్రామాల జట్లు నమోదు చేసుకున్నారని చర్ల పోలీసులు తెలిపారు. ఇందులో జిల్లాకు సరిహద్దులో ఉన్న చత్తీస్గఢ్ రాష్ట్ర గ్రామాలలో క్రీడాకారులను కూడా ఆహ్వానించడం జరిగిందన్నారు. పరితోష్ పంకజ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలనే ఉద్దేశంతో పోటీలు చేపట్టినట్లు చెప్పారు. యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, గెలుపోటములు సహజమన్నారు. టీమ్ ఇండియా వరల్డ్ కప్ క్రికెట్ సాధించేలా కృషి చేసిన గొంగిడి త్రిషను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

రైతులను మోసం చేస్తున్న మోడీ సర్కార్

విశాలాంధ్ర - తొర్రూర్ : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2025 వార్షిక బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధుల కోతతో రైతాంగాన్ని సమస్యలోనికి నెట్టి వేయడమేనని సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు,తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవిలు అన్నారు. బుధవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించి, బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ సర్కార్ పాలనలో వ్యవసాయరంగం, రైతాంగం సమస్యల వలయంలో చిక్కుకున్నాయని అన్నారు. రైతాంగం మౌలిక సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే మోడీ సర్కార్ మాత్రం రైతులను మోసం చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పంటకు గిట్టుబాటు ధర చట్టం తెస్తానని రాతపూర్వక హామీని మోడీ తప్పారని వారు విమర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరుగుతున్న దశల వారి రైతాంగ పోరాటాలను చూసి భయ పడుతున్న మోడీ సర్కార్ రైతు నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తుందని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 6న జిల్లా కేంద్రంలో మార్చి 10 రాష్ట్ర కేంద్రంలో రైతాంగం వ్యవసాయ కార్మికుల ఆధ్వర్యంలో జరుగు దేశవ్యాప్త నిరసనలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, సిపిఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్, సిపిఐ మండల నాయకులు గణపురం లక్ష్మణ్, సిపిఎం మండల కార్యదర్శి ఎండీ యాకుబ్, ఏఐయు కెఎస్ డివిజన్ అధ్యక్షులు ఉడుగుల రాములు, సోమిరెడ్డి వెంకట్‌రెడ్డి, గద్దల వెంకటయ్య, దొడ్డ కేశవులు, సెగ్గం యాకయ్య, ధరావత్ దేవా, జితేందర్ రెడ్డి, మై పాషా, వెంకటేశ్వర్లు, పత్తోజు భద్రాచారి పాల్గొన్నారు.

లే ఔట్ల క్రమబద్ధీకరణ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: అనధికార లేఔట్ల క్రమబద్ధికరణ, ఈనెల 31వ తేదీలోగా చేసుకుంటే 25 శాతం రాయితీ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో (స్థానిక సంస్థల) (రెవెన్యూ) అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మ చారి, సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్.ఆర్.ఎస్-2020 క్రింద రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు వచ్చాయని. గత సెప్టెంబర్ 2024లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ అయిందని, ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. లక్షా 90 వేల వరకు ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల ఆమోదించే వాటికి మార్చి 31వ తేదీ వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణీత నమూనాలో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరిస్తార న్నారు. 2020 సంవత్సరంలో రూ.1000 కట్టి ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తు చేసుకున్న వారి అర్జీల పరిశీలన ప్రారంభమైందని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సి.ఈ.ఓ పురుషోత్తం, డి.పి.ఓ హరిప్రసాద్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి సాయి కిరణ్, మునిసిపాలిటీల కమిషనర్లు, మండలాల డిప్యూటీ తహసిల్దార్లు పాల్గొన్నారు.

ఇంటర్ వార్షిక పరీక్షలను సజావుగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షాలను అధికారులు సమన్వయంతో పని చేసి సజావుగా నిర్వహించాలని. పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3 వేల 997 మంది జనరల్, 761 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 4 వేల 527 మంది, 769 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు.

సమగ్రాభివృద్ధిలో టీఎన్జీవోలు భాగస్వామ్యం కావాలి

కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలంటే టీఎన్జీవోస్ సంఘం నాయకుల భాగస్వామం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా ఆ సంఘ నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలను, గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి పరుచుకోవడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా సమ్మిళితాభివృద్ధిని కొనసాగించేలా విస్తృత పరిధిలో ఒక సమీకృత విధానాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం సలహాలు సూచనలు ఇవ్వాలని టీఎన్జీవోస్ నాయకులను కోరారు. ప్రధానంగా రైతులకు సాంకేతికతనుపై అవగాహన కల్పించడానికి విజ్ఞాన ప్రదర్శనలను నిర్వహించాలని కోరారు. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. టీఎన్జీవో సంఘం తరఫున వ్యవసాయ రంగం బలోపేతం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు, కార్యదర్శి సాయి భార్గవ్ చైతన్య, జిల్లా కార్యవర్గం పాల్గొంది.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన వాల్ పోస్టర్లు

విశాలాంధ్ర- పినపాక: పినపాక మండలంలోని వలస గుత్తికోయ వలస ఆదివాసి గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. గుత్తి కోయల గ్రామాలైన మల్లారం, మద్దుల గూడెం, ఎర్రకుంట, చింతలపాడు, సుందరయ్య నగర్‌తో పాటు పలు ప్రాంతాలలో మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలసిన వాల్ పోస్టర్లు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఈ పోస్టర్లు మావోయిస్టులకు వ్యతిరేకంగా ట్రైబల్ యూత్ అసోసియేషన్ పేరుతో ఉండటం గమనార్హం. బుధవారం వెలసిన ఈ పోస్టర్ల లో "శాంతియుత జీవనం మన హక్కు... అనుమానితుల సమాచారం ఇద్దాం - పోలీసులకు సహకరిద్దాం.. అంటూ రాసి ఉంది. "మావోయిస్టులు వద్దు - అభివృద్ధి ముద్దు" అంటూ నినాదాలు కూడా ఉండటం గమనార్హం. అయితే ఈ పోస్టర్లు 'తెలంగాణ ట్రైబల్ యూత్ అసోసియేషన్' పేరుతో వెలవడంతో మండలం లో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇన్నాళ్ళు గుంభనంగా ఉన్న ఏజెన్సీ గ్రామాల్లో పోస్టర్లు వెలవడంతో వలస ఆదివాసి గ్రామాల తోపాటు స్థానిక ఆదివాసీల్లో ఏదో జరగబోతుందని అనుమానం, సందేహాలు వెంటాడుతున్నాయి.

సమానత్వంతోనే సమాజ పురోగతి : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ప్రస్తుత సమాజం ముందుకు పోవాలంటే సమానత అవసరమని, సమాజంలో మహిళలు పురుషులలో విభేదాలు ఉండడం సమాజానికి మంచి కాదని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. ఈనెల ఎనిమిదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో వివిధ శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహిస్తున్న క్రీడలను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు 16 రకాల క్రీడలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, క్రీడలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. రెండు రోజులపాటు జరిగే క్రీడలను సంబంధిత అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా మానసిక దృఢత్వాన్ని ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని దీని ద్వారా వివిధ శాఖల మధ్య ఉద్యోగుల మధ్య మంచి సఖ్యత సమన్వయం ఏర్పడతాయని అన్నారు. అంతేకాకుండా ఈ క్రీడా స్ఫూర్తితో మహిళలందరూ వారి శాఖలలో, ఉద్యోగ, వృత్తులలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రజలకు పేదవారికి అందివ్వవలసినటువంటి సేవలను ఉత్తమ రీతిలో అందించాలని కోరుతూ ఈ మహిళా దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని మహిళలందరూ తమ తమ వ్యక్తిగత జీవితాలలో కూడా ఒక ఉన్నతమైనటువంటి లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించుట కొరకు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే.శిరీష, టిజిఓ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కందుల జీవన్ కుమార్, ట్రెజరర్ ప్రకాష్‌రెడ్డి వైస్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణ నాయక్, జాయింట్ సెక్రెటరీ శైలజ, యశ్వంత్, రఫిక్, టీజీవో బాధ్యులు, మహిళా ఉద్యోగులు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 350 మంది విద్యార్థులు గాను 340 మంది విద్యార్థులు హాజరయ్యారు మిగతా 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపల్, చీఫ్ సూపర్డెంట్ వెంకట రమణ, తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష రాసేవిద్యార్థులు, ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 వరకు జరుగుతాయని, నేరేడుచర్ల స్పందన జూనియర్ కళాశాల, గరిడేపల్లి మండలంలో గడ్డిపల్లి మోడల్ స్కూల్, గరిడేపల్లి కస్తూరిబా పాఠశాల, విద్యార్థులు, మండలంలోని చిల్లేపల్లి ఉన్న (గుడుగుంట్లపాలెం) జ్యోతి రావు పులే గురుకుల బాలికల విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలో తహసీల్దార్ సురగి సైదులు పరిశీలించారు. విద్యార్థులకి త్రాగునీరు, టాయిలెట్స్, బెంచిల్ గురించి ప్రిన్సిపాల్ అడిగి వివరాలు తెలుసుకున్నారు.

శివ సాయి క్రషర్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: జిల్లాలోని అనుమతులు లేకుండా అక్రమంగా క్రషర్ నడుపుతున్న శివసాయి క్రషర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కురవి మండలతహసిల్దార్ ఉప్పల సునీల్ కుమార్‌కు సిపిఐ మండల పార్టీ నాయకులు శివసాయి క్రషర్ అక్రమాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అనుమతులు ఒకచోట నామ మాత్రంగా తీసుకొని, మరోచోట ఎక్కువ విస్తీర్ణంలో క్రషర్ నడుపుతూ, చుట్టుపక్కల ఉన్న పంట పొలాలను నష్టపరుస్తూ, జనవాసాలకు దగ్గరలో బాంబు బ్లాస్టింగ్‌లు చేయడం మూలంగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే పరిమిత అనుమతిని కూడా రద్దుచేసి, అక్రమంగా క్రషర్ నడిపించిన యజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. మైనింగ్ అధికారులు తక్షణమే స్పందించాలని, మైనింగ్ అక్రమాలపై త్వరలోనే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, బొల్లం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు చేయూతను అందించిన టిడిపి నేత వంశీ

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందు మండలంలోని శేషగిరి బస్తి నివాసి కడెం సాంబామూర్తి కుమార్తె జీవన శ్రీ డిగ్రీ ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న క్రమంలో టిడిపి నేత ముద్రగడ వంశీ ఆర్థిక చేయూతనిచ్చారు. బిఎస్సి నర్సింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఆమెకుటుంబం పరీక్షల ఫీజు కట్టుకోలేని పరిస్థితిలో వుంది. ఇబ్బందుల్లో వున్న సంబమూర్తి టిడిపి నేతలు వంశీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు చాందావత్ రమేష్ బాబు, మట్టల రత్నాకర్ లను సంప్రదించి సహాయం చేయాలని కోరారు. ఏడాది క్రితం సాంబమూర్తి ఒక కాలును తీసేయడం తో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. వెంటనే స్పందించిన ముద్రగడ వంశీ ఫోన్ పే ద్వారా రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించి తన దాతృత్వాన్ని చాటారు. మంచి మార్కులతో పాసై తల్లిదండ్రులకు ఊరట కలిగించాలని కోరారు. వంశీ చేసిన సహాయనికి సాంబామూర్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్యామ్ తీవరి, పాదిలా శ్యామ్, సుందర్, చెలిమల బాబు, దాసరి గోపాలకృష్ణ, అయ్యూరి నాగరాజు, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థిపై ఇల్లందు సీఐ మానవత్వం

విశాలాంధ్ర - ఇల్లందు : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన మొదటి రోజు నేపథ్యంలో విద్యార్థులు కొందరు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవడంలో కొన్ని ఇబ్బందులు పడ్డారు. బుధవారం పరీక్షల బందోబస్తులో డ్యూటీలో వున్న పోలీసులు విద్యార్థులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఒక దివ్యంగ విద్యార్థి పరీక్షా కేంద్రానికి చేరేందుకు ఇబ్బంది పడుతుండగా స్థానిక సీఐ బత్తుల సత్యనారాయణ చేయూత నిచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సీఐ తన చేతులతో స్వయాన తోడుగ ముందుకు వచ్చి ఆ విద్యార్థిని స్కూటీపై కూర్చోబెట్టి పరీక్షా కేంద్రానికి పంపేలా ఏర్పాట్లు చేశారు. పోలీస్ అధికారి అనే భావన కొంత పక్కన పెట్టి సామాన్యుడిల వ్యవహరించారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల పై నిరంతరం దృష్టి పెట్టి వారికి కావలసిన ఏర్పాటు చేయాలని తన సిబ్బందికి చెప్పడమే కాకుండా స్వయానా సిఐ ఆచరించి చూపెట్టారు. పోలీసు అధికారులు కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాదు...సమాజానికి తోడుగా నిలిచే వ్యక్తులుగా కూడా నిలబడాలని ఆయన నిరూపించారు. ఈ రోజు సిఐ సత్యనారాయణ ఉదంతం సోషల్ మీడియాలో బాగా ప్రచారం అయింది. ప్రతి ఒక్కరూ సీఐను ప్రశంసిస్తున్నారు. ఒక విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆయన సకాలంలో స్పందించిన తీరు అభినందనీయం.

జిల్లా అభివృద్ధికి కృషి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : జిల్లా అభివృద్ధి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా కలెక్టర్ ఛాంబర్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ చూపడం జరుగుతుందన్నారు. వసతి గృహాల్లో రాత్రి బస చేయడం వల్ల విద్యార్థుల మంచి చెడులు తెలుసుకోవడం సంతృప్తిని ఇచ్చిందన్నారు జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో జనవరి మాసం నుండి ముందుకు వెళ్లడం జరుగుతుందని, వేసవిలో విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు కార్యాచరణలో భాగంగా ట్రాన్స్ఫార్మర్లు మార్చడంతో పాటు విద్యుత్తు లైన్లను సరి చేయడం జరుగుతుందని ఏడాది కాలం పాటు జిల్లాలో పనిచేయడం వల్ల ఈ ప్రాంతంలో ఎంతో నేర్చుకోవడం జరిగిందని రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో అందించేందుకు సంబంధిత శాఖల ద్వారా లక్ష్యాలను చేరవేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదలవడంతో జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ ప్రభుత్వ బాల, బాలికల జూనియర్ కళాశాలలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరీక్షల తొలిరోజు అయిన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా లేదా అని పరిశీలించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం ఉన్నారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా లక్ష్మీదేవిపల్లిలోని నలంద జూనియర్ కళాశాలలో గల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం సందర్శించారు. అక్కడ విధులలో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు నరేష్, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మిక సంఘం నేత మొండయ్య మృతి

నివాళులర్పించిన సిపిఐ సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : సిపిఐ, ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు మొండయ్య (55) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. ఈ విషయం తెలుసుకొని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల హక్కులు, సంక్షేమంకోసం మొండయ్య చేసిన కృషిని సాబీర్ కొనియాడారు. అయన మృతి జిల్లా కార్మికోద్యమానికి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో నాయకులు గుంటీ రాజయ్య, లాల్‌మియా, చాతిరి రమణయ్య, పితాని జయప్రకాష్, బైరి శ్యామ్ నారాయణ, ఎరుకొండ రమేష్,అనుమాల రాజు, అనుమాల రవి, సంకినేని నర్సింహా, అల్లిక వీరయ్య, దాసారపు శివ, రావూరి వెంకట్రావు, సూరం రాము, చెక్క కోటేశ్వరరావు, గుంటీ మల్లయ్య, పాలకుర్తి సుబ్బారావు, తాటిపర్తి ఆనందరావు, బొద్దుల ఉమా శంకర్, కొరదాల వెంకట్రావు, మాదాసు చంటి, రహీమ్, మీడిదొడ్డి చిరంజీవి, బియ్యాని లక్ష్మి నారాయణ, ముత్యాల చందర్, దాసరి శ్రీను, దాసరి సత్యం, గోపాల్, బాబురావు, కొప్పర్తి దాసు తదితరులు వున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : ఇటీవల నూతన పద్ధతులలో జరుగుతున్న పలు రకాల నేరాల నిరూపణకు సీసీ కెమెరాలు తోడ్పాటు ఎంతో అవసరమని ఈ క్రమంలో దేవాలయాలు మసీదు చర్చిల వద్ద సంబంధిత నిర్వహణ కమిటీ సభ్యులు తప్పనిసరిగా సంబంధిత ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారామ్ కోరారు. మంగళవారం ఆయన పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రదేశాలు పవిత్ర స్థలాలు ధార్మిక వ్యవస్థలు, సముదాయాలు గుడి మసీదు చర్చ్ ఈద్గా మొదలైన ప్రార్థన స్థలాలలో నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. నిర్లక్ష్యం వహించిన ఎడల ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆ సమస్య మరింత జఠిలమై శాంతి భద్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉందని ఈ పరిస్థితులలో ఆయా సంస్థల నిర్వాహకులు చైర్మన్ కమిటీ సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే దిశగా కృషి చేయాలన్నారు.ఏదైనా ఆ ప్రదేశంలో నేరం జరిగినప్పుడు సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాలే ప్రత్యక్ష సాక్షులుగా మారే అవకాశం ఉందని ప్రస్తుత పరిస్థితుల్లో సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతో ఉందని ఈ విషయం దృష్టిలో ఉంచుకొని తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

టెన్త్ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర - కొమరం భీం : బెజ్జూర్ మండలంలోని సోమిని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇట్టి సమావేశానికి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, జిసిడివో శకుంతల, ఏటీడీవో కమర్ హుస్సేన్, హాజరయ్యారు. విద్యార్థుల హాజరు ఉపాధ్యాయుల హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ ప్రధానోపాధ్యాయులు చూపించాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకుందాం : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : శాంతియుత వాతావరణంలో, ప్రశాంతంగా, సోదర భావంతో ఈ సంవత్సరం రంజాన్ పండుగను జరుపుకుందామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేందుకు అన్ని వర్గాల వారు సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా రంజాన్ సందర్భంగా పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలకు ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనుకోకుండా విద్యుత్తు సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కరించేందుకుగాను ఒక క్విక్ రెస్పాన్స్ టీమ్ వాహనం ఏర్పాటు చేయాలని విద్యుత్తు శాఖ ఎస్ ఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. నల్గొండ పట్టణంతో పాటు, ముఖ్యమైన పట్టణాలలో మసీదులు, ప్రార్థన స్థలాలు, రహదారులపై పరిశుభ్రత లోపించకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. విలీన గ్రామాలలో పారిశుధ్యాన్ని జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షించాలని చెప్పారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎక్కడ బెల్ట్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించగా, రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేకంగా తెల్ల కార్డుదారులకు ఇచ్చే రేషన్ విషయంలో గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే శాంతి భద్రతాలను జిల్లా ఎస్పీ పర్యవేక్షిస్తారని చెప్పారు. రంజాన్ రోజున పాల వినియోగం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల పాలు ఎక్కువగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరగా, డైరీ డెవలప్మెంట్ కు లేఖ రాయడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251442 నంబర్ కు కాల్ చేసి తెలియజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసాన్ని దృష్టిలో ఉంచుకొని సున్నిత ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పెంచడం జరుగుతుందని, గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా రాత్రి సమయంలో షాపుల నిర్వహణ సమయంలో ఎలాంటి మార్పు ఉండదని, పోలీస్ తరఫున ఇందుకు సహకారం ఇస్తామని, ప్రకాశం బజార్లో సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫుట్ పాత్ వ్యాపారాలు నిర్వహించుకోవాలని ఆయన కోరారు.

సంపాదకీయం

భాష పేరుతో చిచ్చు

"రాజ్యాంగంలో ఉన్న అంశాల ఆధారంగా త్రిభాషా సూత్రాన్ని అమలు చేస్తాం. బహుభాషా విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా జాతీయ ఐక్యతను పెంపొందింప చేస్తాం. ఇందులో మరింత వెసులుబాటు ఉంటుంది. ఏ భాషనూ ఏ రాష్ట్రం మీద రుద్దబోం" అని కేంద్ర ప్రభుత్వం చెప్తూ ఉంటుంది. కానీ దేశ వ్యాప్తంగా హిందీని రుద్దడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంటుంది. ప్రధానమంత్రి మోదీకి హిందీ మాతృ భాష కాదు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాకూ మాతృ భాష కాదు. కానీ బీజేపీ మొదటి నుంచి వేళ్లూనుకున్నది హిందీ మాట్లాడే ప్రాంతాల్లోనే కనక హిందీ మాట్లాడని రాష్ట్రాల మీద కూడా ఆ భాషను రుద్దాలని ప్రయత్నిస్తూ ఉంటుంది. బీజేపీ అధికారంలో లేక ముందు కూడా త్రిభాషా సూత్రం ప్రస్తావన ఉండేది. 2000 సంవత్సరం నాటి జాతీయ పాఠ్య ప్రణాళికలో కూడా "త్రిభాషా సూత్రం జాతీయ ఏకాభిప్రాయం ఫలితంగా కుదిరింది. బహుభాషా విధానాన్ని, జాతీయ సామరస్యాన్ని ప్రోత్సహించడానికి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలి" అని పేర్కొన్నారు. 2005, 2023 నాటి జాతీయ పాఠ్య ప్రణాళికలోనూ ఇదే మాట చెప్పారు. ఎవరు ఎన్ని భాషలు నేర్చుకుంటారు అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. ఒక భాష మాత్రమే వచ్చిన వారికి ఏ భాషా రానట్టే అని భాషా శాస్త్రవేత్తలు అంటూ ఉంటారు. అన్ని రాష్ట్రాల వారికి అర్థమయ్యే రీతిలో దేశ వ్యవహారాలు నడపడానికి ఒక అనుసంధాన భాష అవసరం అన్న విషయంలో భేదాభిప్రాయాలు ఉండనవసరం లేదు. కానీ ఆ అనుసంధాన భాష ఏది అనే విషయంలో పేచీలు దశాబ్దాలు గడిచినా తెగడం లేదు. హిందుస్థానీని అనుసంధాన భాషగా చేయాలన్న భావన జాతీయోద్యమ సమయంలో గాంధీ, నెహ్రూ లాంటి వారికి ఉండేది. హిందుస్థానీ అంటే ఉర్దూ-హిందీ సమ్మిళిత భాష. అదే సర్వజనామోదం పొంది ఉంటే పేచీ ఉండేది కాదు. హిందీని అందరిపై రుద్దాలనుకునే వారు హిందుస్థానీ స్థానంలో హిందీని ప్రతిష్ఠించాలని చూశారు. అందువల్లే అవసరమైనంత కాలం ఇంగ్లీషు వాడాలన్న నిర్ణయానికి వచ్చారు. కొఠారీ కమిషన్‌గా ప్రసిద్ధమైన విద్యా కమిషన్ 1964-66 లో అధికారికంగా త్రిభాషా సూత్రాన్ని ప్రతిపాదించింది. దీనిని ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1968 లో జాతీయ విద్యా విధానంలో భాగంగా అంగీకరించారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1985లో మళ్లీ ఇదే పని చేశారు. 1992 లో పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి ఇదే విధానం అనుసరించారు. విద్యార్థులు తమ మాతృ భాష లేదా ప్రాంతీయ భాష, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే అధికార భాష, ఈ రెండింటితో పాటు భారతీయ భాషల్లో ఒక ఆధునిక భాష లేదా ఒక యూరప్ భాష నేర్చుకోవాలని సూచించారు. అయితే అన్ని రాష్ట్రాలతో వ్యవహారం నడపడానికి కేంద్రం ఒక భాషను, ప్రధానంగా భారతీయ భాషను అమలు చేసే అవకాశం రానే లేదు. అందుకే అవసరమైనంత కాలం ఇంగ్లీషును వాడుకోవచ్చు అనుకున్నాం. ఇప్పుడు అవకాశం ఉన్న వారంతా రెక్కలు కట్టుకుని అమెరికాలోనో మరో దేశంలోనో వాలిపోవాలనుకుంటారు కనక ఇంగ్లీషు నేర్చుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. నిజానికి యూరోపియన్ దేశాల్లో అన్ని చోట్లా ఇంగ్లీషు చెలామణిలో ఉండదు. జర్మనీలో చదువుకోవాలంటే ఆ భాష నేర్చుకోవలసిందే. లేదా అనువాద సౌలభ్యమైనా ఉండాలి. వెరసి అలాంటి దేశాలలో బోధన వారి భాషల్లోనే సాగుతుంది.

అవసరమైనంత కాలం ఇంగ్లీషును వాడుకోవచ్చు అన్న సూత్రాన్ని పాటిస్తే కొంప మునిగేది ఏమీ లేదు. కానీ బీజేపీ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం హిందీని అన్ని రాష్ట్రాల మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నందువల్ల దక్షిణాది రాష్ట్రాల నుంచి ప్రధానంగా తమిళనాడు నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. భాష ఎన్నడూ రాజకీయాలకు అతీతంగా ఉండదు. ఎవరి భాష వారికి ప్రీతిపాత్రమైందే. కానీ ఇతర భాషల వారితో సంబంధాలు ఉండాలంటేనే మరో భాష తెలియాల్సిన లేదా నేర్చుకోవలసిన అవసరం వస్తుంది. దీన్ని ఎవరి అవసరానికి తగ్గట్టు వారికి వదిలేస్తే సమస్యే లేదు. కానీ హిందీని రుద్దాలన్న పట్టుదల భాషా వివాదాలకు దారి తీస్తోంది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ త్రిభాషా సూత్రాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. తమిళనాడు ద్విభాషా సూత్రాన్నే అనుసరిస్తోంది. ఇది దశాబ్దాలుగా కొనసాగుతోంది. దీని ప్రకారం మాతృ భాషతో పాటు ఇంగ్లీషు కూడా అమలవుతోంది. మూడో భాషగా హిందీ వినియోగించడం ద్వారా దేశంలో భాషా వైవిధ్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు అన్న వాదనను తమిళనాడు ముందు నుంచీ అంగీకరించడం లేదు. స్టాలిన్ ఈ వివాదానికి ఆర్థిక కోణం కూడా జోడిస్తున్నారు. మేం ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళ్లాల్సిన అవసరం లేదంటున్నారు. అంటే ఆర్థికాభివృద్ధి సాధించగలిగితే దేశంలోని వైవిధ్యాన్ని వినియోగించుకోవడానికి హిందీతో పని లేదు అన్నది ఆయన వాదన. హిందీ మాట్లాడే వారే తమ రాష్ట్రాల్లో ఉపాధి దొరకక ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటారు అనేది స్టాలిన్ తర్కం. ఒక రకంగా స్టాలిన్ వాదనలో పస ఉంది. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలలోకి వెళ్లే వారు అక్కడ భాష నేర్చుకోవలసి రావడం సబబేగా! హిందీ నేర్చుకొమ్మని బలవంతపెట్టడంతోనే సమస్య వస్తోంది. కానీ దక్షిణాదికి వచ్చి పని చేసే వారు ఆ రాష్ట్రాల స్థానిక భాషను నేర్చుకోకుండానే ఇంగ్లీషుతో వ్యవహారం నడిపేయగలుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం హిందీని రుద్దాలని ప్రయత్నించడం అందుకే అర్థరహితమైంది. దక్షిణాది రాష్ట్రాలు హిందీ మాట్లాడే రాష్ట్రాలకన్నా మెరుగైన ఆర్థికాభివృద్ధి సాధించాయి. ఉత్తరప్రదేశ్ లాంటి చోట హిందీ విస్తృతంగా వాడినా అవధి, భోజ్ పురి వాడే వారు ఉన్నారు. హిందీని రుద్దాలన్న ప్రయత్నంలో ఇలాంటి ప్రాంతీయ భాషలను ధ్వంసం చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి. త్రిభాషా సూత్రం వల్ల వివిధ ప్రాంతీయ భాషలు మాట్లాడే వారి మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందని ఆశించారు. కానీ హిందీ మాట్లాడే ప్రాంతాలలో ఇది జరగనే లేదు. ఆ రాష్ట్రాలలో మరాఠీ, బెంగాలీ, కన్నడ భాషలను ప్రవేశపెట్టనే లేదుగా! హిందీ వాడడం వల్ల భారతీయతా భావనను పెంపొందింపవచ్చునన్నది వాస్తవం కాదు. హిందీ మాట్లాడే రాష్ట్రాలు అనుకుంటున్న చోట అనేక ప్రాంతీయ భాషలను హిందీ మింగేస్తోంది. హిందీ గురించి మాట్లాడే వారు తులసీ దాస్, సూర్దాస్ రచనలను ఎందుకు చదవలేకపోతున్నారు? తులసీ దాస్ రామాయణం వీరు చెప్పే ప్రామాణిక హిందీ భాషలో లేదుగా. భాషాభిమానం తప్పు కాదు. దురభిమాన్ని తిప్పికొట్టాల్సిందే. త్రిభాషా సూత్రాన్ని నిరాకరించడంవల్ల సమగ్ర శిక్షా అభియాన్ కింద ఆ రాష్ట్రానికి అందాల్సిన రూ. 573 కోట్లను కేంద్రం అందకుండా చేసింది. అంటే హిందీని అమలు చేయక పోతే నిధులు నిలిపేస్తారన్నమాట. ఇది భాషాభిమానం పేరిట భాషా విద్వేషాన్ని ప్రోత్సహించడమే.

నిరాశలో మిర్చి రైతాంగం

కేవీవీ ప్రసాద్

రాష్ట్రంలో మిర్చి రైతాంగం మరోమాటలో చెప్పాలంటే వివిధ పంటలు సాగు చేసే రైతులంతా నిరాశలో వున్నారు. మార్చి 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ప్రతినిధిబృందం గుంటూరులోని మిర్చి యార్డును సందర్శించి, మిర్చి అమ్మకాలు, కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించింది. మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన రైతులు యార్డుకు మిర్చి తెచ్చారు. , వ్యాపారులు వచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వివరాల ప్రకారం 1,82,384 బస్తాల(టిక్కీలు)తో 72,953.60 క్వింటాళ్ల మిర్చి మార్కెట్‌కు చేరింది. యార్డు మొత్తం మిర్చి బస్తాలతో, రైతులతో నిండి వుంది. రైతుసంఘ ప్రతినిధి బృందం ఏ రైతును కదిలించినా మార్కెట్ స్థితి బాగాలేదు. గిట్టుబాటు కాదు. ఉత్పత్తి ఖర్చులు ఏ ఏటికాయేడు పెరుగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి సరుకు తెచ్చి తిరిగి తీసుకువెళ్లలేం కదా... ధర వచ్చిన కాడికి ఇచ్చిపోవటం తప్ప అంటూ నిరాశ వ్యక్తపరిచారు. మరో పక్క ప్రస్తుతం ధర కొంతమేర ఆశాజనకంగా వుంది. మరింత పెరిగే అవకాశం వుందంటూ వ్యాపార వర్గాలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచాయి. యార్డులో కమీషన్ ఏజెంట్ల దోపిడీ మరొక రకం. మార్కెట్ నిబంధనల ప్రకారం రైతుల నుంచి కమీషన్ ఏజెంట్లు 2 రూపాయలు వసూలు చేయాలి. ఇక్కడ కమీషన్ ఏజెంట్లదే ఇష్టారాజ్యం. హమాలీ చార్జీలు, సరుకు దింపుడు కూలి, సరుకు కాపలా కూలి పేర్లతో నిబంధన ప్రకారం 29 రూపాయలు పేమెంట్ కింద ప్రతి బస్తాకు 4.23 రూపాయలు వసూలు చేయాలి. రైతుకు పై రేట్లు తెలియవు. అవి వ్యవసాయ మార్కెట్ కమిటి వారి ఫైళ్లలో నిక్షిప్తమై వుంటాయి. ఇవి కాక రైతు తమ సరుకు నింపుకుని తెచ్చే గోతం ఖరీదు బయట మార్కెట్‌లో 50 నుంచి 65 వరకు వుంటుంది. రైతుకు చెల్లించేది మాత్రం కేవలం 25.00 రూపాయలు మాత్రమే. ఈ రకంగా రైతులు అడుగడుగునా దగాకు గురవుతున్నారు. మచ్చు పేరుతో 7 రూపాయలు వసూలు చేస్తారు. అంటే ప్రస్తుతమున్న రేటులో అరకిలో కాయలు మచ్చు కింద పోతాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీవారు అందించిన వివరాల ప్రకారం ఫిబ్రవరి 28వ తేదీన 96,123 బస్తాలలో 38,451 క్వింటాళ్ల మిర్చి మార్కెట్‌కు వచ్చింది. కామన్ వెరైటీల మోడల్ ధర రూ.12,200 నుంచి 13,700 వరకు పలికాయి. స్పెషల్ వెరైటీల మోడల్ ధర రూ. 10,700 నుంచి 14,000 వరకు పలికాయి. తాలు కాయలలో కామన్ రకం రూ. 5,000 నుంచి 7,000 వరకు, స్పెషల్ వెరైటీ రూ. 5,500 నుంచి 7,000 వరకు ధర పలికాయి. అదేవిధంగా మార్కెట్‌లోకి మార్చి 3న 1,82,384 బస్తాల్లో 72,953.60 క్వింటాళ్ల సరుకు వచ్చింది. కామన్ వెరైటీ రకాలు 12,000 నుంచి 13,900 రూపాయల వరకు, మోడల్ ధర, స్పెషల్ వెరైటీ రకాలు 10,700 నుంచి 14,000 రూపాయల వరకు ధర పలికాయి. తాలు వెరైటీలో కామన్ రకాల మోడల్ ధర రూ. 6,500 నుంచి 6,700, స్పెషల్ వెరైటీ రకాల మోడల్ ధర రూ. 6,000 నుంచి 6,800 వరకు ధర పలికాయి. మార్చి 3న మార్కెట్‌కు అదనంగా సరుకు వచ్చినా ధర తగ్గలేదని, నిలకడగా వుందంటున్నారు వ్యాపార వర్గాలు, మార్కెట్ కమిటీ అధికారులు. రైతులు మాత్రం ధరపై పెదవి విరుస్తూ నిరాశను వ్యక్తంచేస్తూనే వున్నారు.

మరోపక్క గత 2,3 సంవత్సరాల్లో మంచి ధర వస్తుందనే ఆశతో రైతులు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకున్న మిర్చి అమ్మకానికి పెట్టడం లేదు. మన మిర్చి ఎగుమతులు చేసే దేశాల్లో ఇటీవల వర్షాలు, వరదలు, తెగుళ్లవల్ల పంట దెబ్బతిన్నందున మన మిర్చికి అధిక ధర వచ్చే అవకాశాలున్నాయని కమీషన్ ఏజెంట్లు, ఎగుమతిదారులు, అధికారులు, ప్రభుత్వ వర్గాలు ఆశలు కల్పిస్తున్నాయి. ఈ దశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్వింటాకు 11,781 రూపాయలు రేటు నిర్ణయించి, అంతకు తగ్గితే రైతులకు మద్దతు ధర పథకం పేరుతో మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం పెట్టబోతున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణాయక ధర రైతాంగానికి ప్రస్తుత దశలో ఏమాత్రం ఆమోదంగా లేదు. 2023-24 సంవత్సరాల్లో వున్న ధరలు, పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, ప్రకృతి వైపరీత్యాల నష్టాలు బేరీజు వేసి కనీసం రూ.18,000 నుంచి 20,000 మోడల్ ధర వుండేలా ప్రభుత్వం ధర నిర్ణయించి, సిండికేట్‌గా వ్యవహరిస్తూ ధరలతో పాటు, యార్డులో వివిధ అంశాల్లో నష్టపరుస్తున్న వ్యాపార వర్గాల బారి నుంచి రైతాంగాన్ని కాపాడాలని రైతాంగం రైతు సంఘ ప్రతినిధి బృందం ముందు తమ ఆవేదనతో కూడిన అభిప్రాయాలను వ్యక్తం చేసింది. ప్రభుత్వం ప్రకటించిన మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్‌కు సంబంధించి ఎటువంటి నిబంధనలు ప్రకటించలేదు. ప్రస్తుతం తాలుకాయ రకాలు మినహా అన్ని రకాలు ప్రభుత్వం ప్రకటించిన ధరకన్నా కొంతమేర పెరగటంతో పథకం ప్రయోజనం ఏమాత్రం లేదు. మన రాష్ట్రంలో పంట సాగు తగ్గడం, ఇతర దేశాలకు ఎగుమతి అవకాశాలున్నా రేటు పెరగాల్సినంత పెరగకుండా వ్యాపారుల సిండికేట్ అడ్డుకుంటున్నదనే వాదన లేకపోలేదు. ఈ స్థితిలో రైతులకు మంచి ధర లభించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలి. సకాలంలో జోక్యం చేసుకుని వ్యాపారులు, ఎగుమతిదారులతో సమీక్షలు నిర్వహించాలి. విదేశాల ఆర్డర్లు పొందే అవకాశాలు అన్వేషించాలి. రైతులకు ప్రయోజనం కలుగచేయాలి. లేకుంటే రైతులు పంట అమ్ముకున్న తర్వాత ఫలితాలు వ్యాపారులకు దక్కుతాయి.

మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్‌లో తమకు సరుకు అమ్మిన రైతుల వివరాలు 2024 డిసెంబర్ 1 నుంచి రైతు ఆధార్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ తదితరాలు అందించాలని మార్కెటింగ్ అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నట్లు కమీషన్ ఏజెంట్లు తెలిపారు. రైతులు సదరు వివరాలు అందించకపోవడం సమస్యగా వున్నందున వ్యవసాయ అధికారుల ద్వారా ఈ-క్రాప్ నమోదు పత్రాలు పొందాలే కానీ, తమను ఇబ్బంది పెట్టరాదని వారంటున్నారు. అనేక సంవత్సరాలుగా వున్న మిర్చియార్డు ప్రస్తుతం రైతాంగ అవసరాలకు తగినట్లుగా లేదు ఇరుకుగా ఉంటుంది. మార్కెట్‌యార్డులో షాపుల కోసం 683 మంది లైసెన్స్ హోల్డర్లు ధరఖాస్తు చేసుకుంటే 624 మందికి మాత్రమే మార్కెటింగ్ శాఖాధికారులు షాపులు కేటాయించారు. మరో 51 మంది ధరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. సరుకు అధికంగా వచ్చిన రోజుల్లో షాపులవారు, రైతాంగం చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తున్నది. కనీసం యార్డులో నడిచేందుకు కూడా ఖాళీ ఉండదు. బయట నుంచి మార్కెట్‌లోకి వచ్చిన వాహనాలు తిరిగేందుకు మిర్చిని లోడింగ్, అన్‌లోడింగ్ చేసి రవాణా చేసేందుకు తగిన సౌకర్యాలు లేవు. ప్రస్తుతం రైతుల, వ్యాపారుల అవసరాల రీత్యా విశాలంగా ఉండే విధంగా మార్కెట్ యార్డు నిర్మాణం చేస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు అనేక సంవత్సరాలుగా వాగ్దానాలు చేస్తున్నా ఆచరణలో కొత్త యార్డు నిర్మాణం ఆలోచనలోనే నిలిచిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆర్భాటపు ప్రకటనలు మాని రైతులకు మంచి ధరలు వచ్చేలా చర్యలు చేపట్టాలి. ఏ పంట వేసినా ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుకు దక్కేది కష్టాలు కన్నీళ్లేననే భావన రైతాంగానికి వుంది.

ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

గత 2,3 సంవత్సరాల్లో మంచి ధర వస్తుందనే ఆశతో రైతులు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకున్న మిర్చి అమ్మకానికి పెట్టడం లేదు. మన మిర్చి ఎగుమతులు చేసే దేశాల్లో ఇటీవల వర్షాలు, వరదలు, తెగుళ్లవల్ల పంట దెబ్బతిన్నందున మన మిర్చికి అధిక ధర వచ్చే అవకాశాలున్నాయని కమీషన్ ఏజెంట్లు, ఎగుమతిదారులు, అధికారులు, ప్రభుత్వ వర్గాలు ఆశలు కల్పిస్తున్నాయి. ఈ దశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్వింటాకు 11,781 రూపాయలు రేటు నిర్ణయించి, అంతకు తగ్గితే రైతులకు మద్దతు ధర పథకం పేరుతో మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం పెట్టబోతున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణాయక ధర రైతాంగానికి ప్రస్తుత దశలో ఏమాత్రం ఆమోదంగా లేదు.

మరో ఐదేళ్లు స్తంభించనున్న వృద్ధి

డా॥ జ్ఞాన్‌పాఠక్

భారతదేశ వృద్ధి రేటు గత నాలుగేళ్లు దిగజారిపోవడమేకాక రానున్న ఐదేళ్లు స్తంభించిపోనుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రకటించింది. 2024-25 నాటికి గడిచిన నాలుగేళ్లు వృద్ధి రేటు దిగజారింది. 2030 దాకా స్తంభించనున్నదని ఐఎంఎఫ్ అధ్యయనం తెలియజేసింది. రానున్న ఐదేళ్లు వృద్ధి రేటు 6.5 శాతమే ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే వార్షిక వృద్ధి రేటు 7.8 శాతం ఉండాలని ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఇండియా అధికంగా శ్రమించడంతో పాటు అభివృద్ధి విధానాల వైపు మళ్లాలి. జాతీయ గణాంకాల కార్యాలయం తాజా అంచనా ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి దేశ జీడీపీ 6.2 శాతం ఉండగా 2024 జులై-సెప్టెంబరు నాటికి జీడీపీ వృద్ధి రేటు 5.6 శాతానికి తగ్గి పోయింది. 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతం ఉండగా, 2025 జనవరిలో విడుదల చేసిన రెండవసారి వేసిన అంచనాల ప్రకారం జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతానికి చేరింది. అయినప్పటికీ గడచిన నాలుగేళ్ల కాలంలో వృద్ధిరేటు అత్యంత తక్కువగానే ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5 శాతం వృద్ధిరేటు సాధించా లంటే ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో వృద్ధిరేటు తప్పని సరిగా 7.6 శాతం సాధించాలి. ఇది మనకు సాధ్యమా అన్నది పెద్ద ప్రశ్న. పాలకులు మాత్రం గొప్పగొప్ప ప్రసంగాలు చేస్తున్నారు. అంతర్జాతీయ సంస్థల నుంచి అపారంగా అప్పులు తెచ్చుకొని దేశాన్ని అప్పుల పాలు చేశారు.

ఇక్కడ ఒక అంశాన్ని గుర్తు చేసుకోవాలి. 2023-24లో జీడీపీ వృద్ధిరేటును 9.2 శాతంగా పునఃసమీక్షించారు. అంతక్రితం 8.2 శాతంగా పునఃసమీక్షించారు. ఇండియాలో గడచిన 12 ఏళ్లలో ఇదే రెండవ అతి పెద్ద అధిక వృద్ధిరేటు. 2021-22 లో దేశంలో వృద్ధిరేటు 9.7 శాతంగా నమోదైంది. ఇది అత్యంత తక్కువ తిరోగమన రేటుకు ప్రారంభం. ఇది (-) 7.3 శాతం. ప్రపంచ బ్యాంకు గత వారం విడుదల చేసిన నివేదికలో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే వార్షిక వృద్ధిరేటు తప్పనిసరిగా 7.8 శాతం వృద్ధి సాధిం చాలి అని తెలిపింది. ఇది జరగాలంటే అన్ని వృద్ధి రంగాలు కదలాలి. సంస్కరణలు వేగవంతం కావాలి. అన్ని రంగాల్లో అధిక ఆదాయం పొందే దేశంగా వృద్ధి చెందాలి. రానున్న రెండేళ్లు 2024-25, 2025-26ల్లో 6.5 శాతం తప్పనిసరిగా జీడీపీ వృద్ధి సాధించడానికి సరైన ప్రణాళికను రూపొందించుకోవాలి. "ఆర్థిక దృష్టి కిందకు దిగజారుతున్న రిస్కులు కనిపిస్తున్నాయి" అని ఐఎంఎఫ్ తెలిపింది.

వాస్తవ ఆదాయాలు తగినంత రాక, తక్కువగా ఉన్నట్లయితే, పెట్టుబడులు బలహీనంగా ఉన్నా, ప్రైవేటు రంగంలో రాబడి రాక వినిమయం తగ్గితే వృద్ధి సాధించడం కష్టమవుతుంది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నట్లయితే వ్యవసాయ ఉత్పత్తులు కూడా ప్రతికూలంగా ఉంటాయి. ఆహారధాన్యాల ధరలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో వినిమయం తగ్గుతుంది. మార్కెట్లలో ఖర్చులు తగ్గుతాయి. వస్తువుల విక్రయాలు పడిపోతాయి. వృద్ధి వైపు సాగాలంటే, సంస్థాగత సంస్కరణలు వేగంగా అమలు జరిగితే, ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతాయి, ఉద్యోగాలు అధికంగా లభిస్తాయి. వృద్ధికి అవకాశాలుంటాయని ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది. ఇండియా ఆర్థిక రంగ సౌష్టవం కార్పొరేట్ బాలెన్సు షీట్లను బలోపేతం చేసిందని, డిజిటల్ ప్రభుత్వ మౌలిక సదుపాయాల పునాది బలపడుతుంది. మధ్య తరహా రంగ వృద్ధికి అవకాశం ఉంటుంది, సామాజిక సంక్షేమ ప్రయోజనాలు ఉంటాయి.

భారత్‌కు 2021-2029-30 మధ్య ఐఎంఎఫ్ రూపొందించిన ప్రణాళిక ప్రకారం వేసిన అంచనా ఇలా ఉంది. వృద్ధిరేటు క్రమంగా 2021-22 మధ్యలో 9.7 శాతానికి దిగజారింది. 2022- 23 నాటికి 7 శాతానికి పడిపోయింది. 2023-24 నాటికి 8.2 శాతానికి తగ్గిపోయింది. ప్రభుత్వం ఇటీవల 9.2 శాతానికి సమీక్షించింది. అనంతరం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ 2024-25 కు వృద్ధిరేటు 6.5 శాతానికి అంచనా వేసింది. 2029-30 వరకు భారత్ వృద్ధిరేటు 6.5 శాతమే ఉంటుందని ఐఎంఎఫ్ తెలిపింది.

గత సంవత్సరంగా పొదుపు, పెట్టుబడులకు సంబంధించి జీడీపీ శాతం పడిపోయిందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల పొదుపు 32.7 శాతంగా అంచనా వేసింది. అయితే ఇది 30.5 శాతానికి పడిపోవచ్చునని తెలిపింది. అలాగే స్థూల పెట్టుబడులు 33.6 శాతం నుంచి 32.6 శాతానికి ఇదే కాలం తగ్గిపోతుందని తెలిపింది. మరోవైపు ఈ గణాంకాలను బీజేపీ ప్రభు త్వం అంగీకరించింది. గత పదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్రమోదీ దాదాపు 140 లక్షల కోట్లు డాలర్లు అప్పు చేశారు. బడా పెట్టుబడి దారులు పన్ను రాయితీలను అపారంగా పొందినప్పటికీ సొంత నిధులను విరివిగా పెట్టుబడులు పెట్టి ఉత్పత్తులు పెంచడానికి సిద్ధంగా లేరని తెలుస్తోంది. 2047 నాటికి ఇండియా అభివృద్ధి చెందిన దేశంగా వృద్ధి చెందుతుందని ప్రచారం మాత్రం సాగిస్తున్నారు.

కార్మికోద్యమ కాగడా ఎ.ఐ.టి.యు.సి.

ఆర్వీ రామారావ్

ప్రస్తుతం సి.పి.ఐ. భావజాలానికి దగ్గరగా ఉన్న అనేక ప్రజాసంఘాలలాగే కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించే అఖిలభారత ట్రేడ్ యునియన్ కాంగ్రెస్ (ఎ.ఐ.టి.యు.సి.) కమ్యూనిస్టు పార్టీకన్నా ముందే 1920 అక్టోబర్ 31న ఏర్పడింది. లాలా లజపత్ రాయ్ ఎ.ఐ.టి.యు.సి. మొదటి అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ కార్మిక సంస్థ ఏర్పాటులో జోసెఫ్ బాప్టిస్టా, ఎన్.ఎం.జోషి, దివాన్ చమన్ లాల్ మొదలైన వారు ప్రధాన పాత్ర పోషించారు. 1920లలో కమ్యూనిస్టు పార్టీ మూలాలు ప్రధానంగా కార్మికవర్గంలోనే ఉండేవి. సోషలిజం, మార్క్సిజం ప్రభావం మేధావి వర్గంలో బలంగా ఉండేవి. ఎ.ఐ.టి.యు.సి. ఏర్పాటును జాతీయోద్యమంలోని చాలా మంది ఆహ్వానించారు. 1920 నుంచి 1928వరకు ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వం కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి నాయకత్వంలోనే ఉండేది.

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడకముందే సింగారవేలు మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్టు 1923లో దేశంలో మొట్టమొదటి సారి నిర్వహించిన మేడే ఉత్సవాల సందర్భంగా ప్రకటించారు. ఆ సమావేశంలో బహుశా మొట్టమొదటి సారి అరుణ పతాకం మన దేశంలో ఎగురవేశారు. 1920 నాటికే మన దేశంలో కార్మిక సంఘాలు ఏర్పాటు కావడం మొదలైంది. 20వ శతాబ్దం మొదటి రెండు దశాబ్దాల్లో బొంబాయి, కలకత్తా, మద్రాసు, కాన్పూర్, కరాచీలాంటి చోట్ల పారిశ్రామిక కార్మికులు సంఘటితం కావడం మొదలైంది. ఈ కార్మికవర్గమే కమ్యూనిస్టు ఉద్యమానికి, సీపీఐకి చోదక శక్తిగా ఉపకరించింది. జౌళి, గనులు, ఓడరేవులు, నౌకా నిర్మాణ కేంద్రాలు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు, రైల్వేలలాంటి రంగాలలో పని చేసే వారు కార్మికోద్యమానికి అండగా ఉన్నారు. ఆ దశలోనే కనీస వేతనాలు అన్న భావన బలపడింది.

ఎ.ఐ.టి.యు.సి. వ్యవస్థాపక మహాసభలో లాలా లజపత్ రాయ్ చేసిన ప్రసంగం చాలా విశిష్టమైంది. ఆ ప్రసంగంలో ఆయన వర్గ పోరాటం, సోషలిజం కోసం పోరాటం, సోషలిస్టు సమాజానికి సోవియట్ యూనియన్ ఎలా ఆదర్శప్రాయమైందో మాట్లాడారు. లజపత్ రాయ్ కమ్యూనిస్టు కాదు. కానీ ఆయన కాంగ్రెస్‌లో అతివాద వర్గానికి ప్రతినిధి. ఆ తరవాత కమ్యూనిస్టులు ఎ.ఐ.టి.యు.సి.లో చురుకైన పాత్ర పోషించడం ప్రారంభం అయింది. ఆ దశలోనే ఎ.ఐ.టి.యు.సి. వామపక్ష భావజాలం వైపు మొగ్గడం మొదలైంది. డాంగే, ఘాటే, మిరాజ్కర్, ముజఫ్ఫర్ అహమద్, సింగారవేలు, జోగ్లేకర్, అజయ్ ఘోష్, పి.సి.జోషి, షాపూర్జీ సక్లత్వాలా లాంటి ఎందరో కార్మికవర్గంలో రాజకీయ చైతన్యం రగిలించడానికి కృషి చేశారు.

ఎ.ఐ.టి.యు.సి.లో రాజకీయ చైతన్యం పెరగడంతో వివిధ ప్రాంతాలలో కార్మిక బృందాలు సంఘటితమయ్యాయి. మార్క్సిస్టు దృక్పథంతో పత్రికల ప్రచరణ కూడా ఆరంభమైంది. డాంగే "సోషలిస్ట్" పత్రిక, ముజఫ్ఫర్ అహమద్ "లంగల్" పత్రిక, సింగారవేలు "లేబర్ కిసాన్ గజెట్" ప్రచురించేవారు. వీరు ఆర్థిక, రాజకీయ పోరాటాలకు శ్రీకారం చుట్టారు. డాంగే మార్క్సిస్టు సిద్ధాంతవేత్త పాత్ర పోషిస్తూ కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకంగా ఉండేవారు. ఆయన కేవలం కార్మిక సంఘ నాయకుడు కాదు. మొత్తం కార్మికవర్గానికే నాయకుడిగా ఎదిగారు. 1921లోనే డాంగే "గాంధీ వర్సెస్ లెనిన్" అన్న గ్రంథంలో వారి రాజకీయ సిద్ధాంతాలను విశ్లేషించారు. ఇవి కమ్యూనిస్టులకు కరదీపికలుగా ఉపకరించాయి. వివిధ సమస్యలను మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించడం ఆ రోజుల్లో డాంగే చేసిన మహత్తరమైన పని. ఇదే వరసలో ఆయన చరిత్ర, తత్వశాస్త్రం, భారతీయ సంప్రదాయాలు మొదలైన అంశాలను కూడా మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించేవారు. మొదటి తరం భారతీయ మార్క్సిస్టులకు అవే స్పష్టమైన అవగాహన కల్పించాయి. ఈ భావాల వ్యాప్తికీ ఆయన "సోషలిస్ట్" పత్రికను వినియోగించుకున్నారు. ఈ దశలోనే హోమీదాజీ, గురు రాధాకృష్ణ, హెచ్.ఎల్. పర్వానా, సరోజ్ పాండే, దర్శన్ సింగ్ కెనెడియన్, అవతార్ సింగ్ మల్హోత్ర కార్మికవర్గ నాయకులుగా ఎదిగారు.

ఎస్.ఎ.డాంగే

లాలా లజపత్ రాయ్

సింగారవేలు చెట్టియార్

హోమీదాజి

బ్రిటిష్ పాలనలోనే మన దేశంలో కార్మికవర్గం గుర్తించగల స్థాయిలో తయారైంది. వలసవాద పాలనలో అప్పటివరకు ఉన్న స్వయం సమృద్ధ గ్రామీణ వ్యవస్థ ఓ వేపు ధ్వంసం అవుతూ ఉండగా మరో వేపు నుంచి క్రమంగా కార్మికవర్గం పెరగడం ప్రారంభమైంది. ఈ క్రమంలో రైతులు పేదవారైపోయారు. విదేశాల నుంచి చౌకైన పారిశ్రామిక వస్తువులు దిగుమతి కావడంతో మన సంప్రదాయ పరిశ్రమలు ధ్వంసం అయిపోయాయి. దీనివల్ల చేతివృత్తులు నాశనం అయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో 1917లో రష్యాలో విప్లవం సఫలం కావడం మన దేశంలో కార్మికోద్యమం బలపడడానికి ఊతం ఇచ్చింది. 1919లో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ.) ఏర్పడడం కూడా ఎ.ఐ.టి.యు.సి. ఏర్పాటుకు దోహదం చేసింది.

మణిపూర్‌లో భూకంపం



ఇంఫాల్: మణిపూర్‌లో గంట వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించాయి. అలాగే ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో ప్రకంపనలు వచ్చాయి. బుధవారం ఉదయం 11.06 గంటల సమయంలో తొలుత 5.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని యైరిపోక్‌కు తూర్పున 44 కిలోమీటర్ల దూరంలో, 110 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు షిల్లాంగ్‌లోని ప్రాంతీయ భూకంప కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో అసోం, మేఘాలయాతోపాలు పలు ఈశాన్య ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయని చెప్పారు. కాగా, గంట తర్వాత మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో 4.1 తీవ్రతతో రెండో భూకంపం సంభవించింది. కామ్‌జోంగ్ జిల్లాలో 66 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మణిపూర్‌లోని పలు భవనాల్లో పగుళ్లు కనిపించినట్లు పేర్కొన్నారు. మరోవైపు తౌబాల్ జిల్లాలో వాంగ్జింగ్ లామ్డింగ్‌లో జాతి ఘర్షణల్లో బాధితులైన నిరాశ్రయుల కోసం సహాయ శిబిరం నిర్వహిస్తున్న స్కూల్ బిల్డింగ్ కూడా పగుళ్లిచ్చినట్లు అధికారులు తెలిపారు. గంట వ్యవధిలో సంభవించిన రెండు భూకంపాల వల్ల జరిగిన నష్టంపై అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి కల్పన: మోదీ

న్యూఢిల్లీ: యువకుల్లో నైపుణ్యాభివృద్ధి, ప్రతిభను పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారానే ఉద్యోగ కల్పన సాధ్యమవుతుందని ప్రధాని మోదీ అన్నారు. వీటన్నింటికీ భాగస్వామ్యపక్షాలన్నీ తోడ్పాటు అందించాలని కోరారు. దీంతో ఆర్థిక వ్యవస్థకూ ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. బడ్జెట్ అనంతరం ఉద్యోగ కల్పన అంశంపై నిర్వహించిన వెబినార్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. 2014 నుంచి ఇప్పటి వరకు మూడు కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ అందించామని వివరించారు. 10 ఐటీలను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ఐదు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను నెలకొల్పాలనుకుంటున్నట్లు చెప్పారు. దేశ అభివృద్ధికి ప్రతిభ, సామర్థ్యాల పెంపు మూల స్తంభాలని పేర్కొన్నారు. దేశ విద్యా విధానం ప్రస్తుతం పరివర్తన చెందుతోందన్నారు. భారత్ ప్రస్తుతం 3.8 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని చెప్పారు. ఏఐ సామర్థ్యాలను పెంచుకోవడం కోసం త్వరలో నేషనల్ లార్జ్ లాంగ్వేజీ మోడల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ తెలిపారు.

కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించండి: స్టాలిన్

చెన్నై: తమిళనాడులో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీ తొలగించాలని సీఎం స్టాలిన్ అన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే... చేతల్లో చూపించాలంటూ ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. ప్రధాని మోదీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని బీజేపీ చెబుతోంది. అదే నిజమైతే... దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుందని అన్నారు. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలని కోరారు. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా చేతల్లో చూపించండి అని స్టాలిన్ పేర్కొన్నారు. కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలులో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న స్టాలిన్ ... మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు.

నితీశ్ పనైపోయింది: తేజస్వీయాదవ్

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. తాజాగా సీఎం నితీశ్‌పై తేజస్వీ విమర్శలు గుప్పించారు. ఆయన అసమర్థ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శించారు. నితీశ్‌ను పాత వాహనంతో పోల్చారు. అసమర్థ ప్రభుత్వం బీహార్ ప్రజలకు వద్దని కోరారు. పదవీ విరమణ వయసు 60గా ఉంటుందని, 75 ఏళ్ల సీఎం కావాలా? అంటూ ఓ కార్యక్రమంలో ప్రజలను తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. "సీఎం అలసిపోయారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పాత వాహనంతో ముందుకు వెళ్లలేం. సరికొత్త దృక్పథంతో అభివృద్ధి సాధించాలి. నితీశ్ రిటైర్ అయ్యారు. ఆయనకు తన డిప్యూటీ సీఎంల పేర్లు కూడా గుర్తు లేవు. త్వరలో మా ప్రభుత్వం ఏర్పాటవుతుంది" అని పేర్కొన్నారు. కాగా.. అసెంబ్లీలో తన ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తేజస్వీ యాదవ్‌పై నితీశ్ కుమార్ మండిపడిన సంగతి తెలిసిందే. గతంలో రాష్ట్ర పరిస్థితి గురించి ప్రస్తావిస్తూ.. ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తన కారణంగానే లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయాల్లో ఎదిగారని వ్యాఖ్యానించారు. ఆయనకు అండగా ఎందుకు నిలుస్తున్నారని లాలూ సొంత మనుషులే అడిగారని.. అయినా మద్దతు ఇచ్చానంటూ పేర్కొన్నారు. తాజాగా నితీశ్‌పై లాలూ కుమారుడు తేజస్వీ ఈ వ్యాఖ్యలు చేశారు.

పోర్టర్ల హక్కుల కోసం పోరాడతాం

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : రైల్వే పోర్టర్ల హక్కుల కోసం పోరాడతామని, వారి డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకువెళతామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బుధవారం తెలిపారు. గత నెలలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో ప్రజలకు సహాయం చేయడానికి వారు తమ ప్రాణాలను పణంగా పెట్టారని, అయినప్పటికీ వారి గొంతు వినిపించడం లేదని అన్నారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో పోర్టర్లతో ఇటీవల జరిగిన సంభాషణ వీడియోను తన యూట్యూబ్ ఛానెల్‌లో పోస్ట్ చేసిన మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు, వారి హక్కుల కోసం పోరాడతానని నొక్కి చెప్పారు. జనసమూహ నిర్వహణను మెరుగుపరచడానికి, భద్రతను బలోపేతం చేయడానికి 'ఆవాజ్ భారత్ కీ' పోర్టల్‌పై సూచనలను పంచుకోవాలని కూడా గాంధీ ప్రజలను కోరారు. 'మేము భారతదేశం స్వరాన్ని వింటాం!' అని ఆయన 'ఎక్స్' లో అన్నారు. రైల్వే స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాలలో పెరుగుతున్న తొక్కిసలాటలు చాలా ఆందోళన కలిగించే విషయం అని గాంధీ అన్నారు. ఇటువంటి సంఘటనలలో చాలా మంది అమాయకులు తమ ప్రాణాలను కోల్పోతున్నారని లేదా గాయపడుతున్నారని తెలిపారు. 'ఇటువంటి విషాదాలను ఎలా నివారించాలో మనం కలిసి ఆలోచించాలి' అని ఆయన అన్నారు. పోర్టర్లతో తన సంభాషణ వీడియోతో పాటు తన పోస్ట్‌లో గాంధీ ఇలా పేర్కొన్నారు. 'కొన్ని రోజుల క్రితం నేను న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాను. అక్కడ పోర్టర్ సోదరులను మళ్లీ కలిశాను. సంభాషణ సమయంలో తొక్కిసలాట జరిగిన రోజున ప్రజల ప్రాణాలను కాపాడటానికి అందరూ కలిసి ఎలా ప్రయత్నించారో వారు నాకు చెప్పారు' అని వివరించారు. 'జనసమూహం నుంచి ప్రజలను తొలగించడానికి ప్రయత్నించడం, గాయపడిన వారు అంబులెన్స్ వద్దకు చేరుకునేలా చూడటం లేదా చనిపోయిన వారి మృతదేహాలను బయటకు తీయడం, ఈ సందర్భంలో వారి స్వంత జేబుల నుంచి డబ్బు ఖర్చు చేయడం ద్వారా ప్రయాణికులకు అన్ని విధాలుగా సహాయం చేశారు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. ఫిబ్రవరి 15న స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట సమయంలో అనేక మంది ప్రాణాలను కాపాడినందుకు, సహాయక చర్యలలో పాల్గొన్నందుకు గాంధీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. 'రోజువారీ వేతనాలు సంపాదించడానికి వచ్చే ఈ సోదరుల కరుణ నన్ను చాలా ఆకట్టుకుంది. వారు ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందుల్లోనే జీవిస్తున్నారు. వారు అభిరుచి, సద్భావనతో నిండి ఉన్నారు. వారికి సహాయం కావాలి. గురించి వారు తమ డిమాండ్లను తెలియజేశారు. వారికి సహాయం చేయడానికి నేను కచ్చితంగా అన్ని ప్రయత్నాలు చేస్తాను' అని తెలిపారు. 'కొన్ని రోజులు మా దగ్గర తినడానికి కూడా డబ్బు ఉండదు. మేము ఇంటికి డబ్బు పంపుతాము లేదా ఆహారం తింటాం' అని ఒక పోర్టర్ చెప్పిన విషయాన్ని హిందీలో చేసిన ఈ పోస్ట్‌లో కాంగ్రెస్ నేత ఉటంకించారు. 'మా పోర్టర్ సోదరులు అలాంటి ఇబ్బందుల్లో జీవించవలసి వస్తుంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. 'న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట సమయంలో ఈ వ్యక్తులు ప్రజలకు సహాయం చేయడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టారు. కానీ వారి గొంతు వినిపించడం లేదు. నేను వారి డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతాను. వారి హక్కుల కోసం నా శక్తి మేరకు పోరాడతాను' అని గాంధీ అన్నారు. కాగా, పోర్టర్లు తాము గ్రూప్-డి ఉద్యోగాన్ని డిమాండ్ చేస్తున్నామని గాంధీకి చెబుతున్న దృశ్యం వీడియోలో ఉంది.

కాంగ్రెస్‌ను లౌకిక పార్టీలు నమ్మగలవా? విజయన్

తిరువనంతపురం: సంఘ్ పరివార్ నేతృత్వ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను బహిర్గతం చేయడమే కాకుండా ప్రతిఘటించడంలోనూ వామపక్షాలు ముందు ఉంటాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఢిల్లీ సహా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు మద్దతిస్తూ, లౌకిక ఓట్ల ఏకీకరణను కాంగ్రెస్ అడ్డుకుంటోందని విమర్శించారు. కొల్లాంలో సీపీఎం రాష్ట్ర సదస్సు నేపథ్యంలో విజయన్ ఓ వ్యాసాన్ని ప్రచురించారు. అందులో కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. లౌకిక ఓట్లను చీల్చాలనే కాంగ్రెస్ వ్యూహంతోనే బీజేపీ విజయం సాధించగలిగిందని దుయ్యబట్టారు. సంఘ్ పరివార్‌ను అడ్డుకోగలిగింది తామేనంటూ చెప్పుకునే కాంగ్రెస్... లేనిశక్తిని ప్రదర్శించడం కోసం లౌకిక ఓట్ల ఏకీకరణను అడ్డుకుందని వ్యాఖ్యానించారు. బీజేపీ ఓడించాలనే ప్రజల కోరికను అణచివేసేలా వ్యవహరించిందన్నారు. రాజస్థాన్, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో రైతులలో అసంతృప్తితో లోక్‌సభ సహా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై ప్రభావం పడినప్పటికీ ఆ పార్టీ అధికారంలోకి రాగలిగిందంటే అందుకు కాంగ్రెస్ విధానమే కారణమని వియజన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీని వ్యతిరేకించే ఇతర విపక్షాలపై కాంగ్రెస్ అహంకారంగా వ్యవహరిస్తోందన్నారు. ఢిల్లీ ఎన్నికలే ఇందుకు ఉదాహరణ అన్నారు. '2015, 2020లో ఢిల్లీలో ఒక్క సీటును కాంగ్రెస్ గెలుచుకోలేదు. ఢిల్లీలో బీజేపీకి గట్టి పోటీ ఇచ్చే ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించడమే ప్రాథమిక లక్ష్యంగా పెట్టుకుంది. ఢిల్లీలో ఆప్‌ను గెలిపించడం తమ బాధ్యత కాదని కాంగ్రెస్ నేతలు అన్నారు' అని విజయన్ తెలిపారు. కాంగ్రెస్ కారణంగా బీజేపీ ఢిల్లీలోని 14 స్థానాల్లో గెలవగలిగినట్లు ఈసీ గణాంకాలు చెబుతున్నాయని అన్నారు. ఢిల్లీలో బీజేపీకి 48, ఆప్‌కు 22 స్థానాలు రావడం విదితమే. లౌకిక ఐక్యతకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటే ఫలితాలు భిన్నంగా ఉండేవని పినరయి విజయన్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ చేసిన తప్పు క్షమించరానిదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌ను లౌకిక పార్టీలు నమ్మగలవా అని ప్రశ్నించారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (కేరళలోని కాంగ్రెస్‌కు మిత్రపక్షం) వంటి పార్టీలు కాంగ్రెస్‌కు మద్దతిచ్చే విషయంలో పునరాలోచన చేయాలని విజయన్ సూచించారు. కాంగ్రెస్ ఇదే తీరు కొనసాగిస్తే మరిన్ని అసెంబ్లీలు బీజేపీ వశం కాగలవని... మతతత్వవాదం పెరుగుతుందని, రాజ్యసభలో ప్రాబల్యం పెరిగితే బీజేపీ లక్ష్యాలకు మార్గం సుగమం కాగలదని, రాజ్యాంగాన్ని మార్చే అజెండా కూడా నెరవేరవచ్చని, ఇదంతా కాంగ్రెస్ విధానాలతోనే జరుగుతుందని పినరయి విజయన్ హెచ్చరించారు. ఢిల్లీ వీధుల్లో బుల్డోజర్లను అడ్డుకోవడం మొదలు సుప్రీంకోర్టులో మతాధార పౌరసత్వ చట్టాలపై న్యాయ పోరాటాలు సాగించడం వరకు వామపక్షాలదే ప్రధానపాత్ర అని అన్నారు. చారిత్రక రైతాంగ ఉద్యమం, జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ, ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాల్ చేస్తూ సాగించిన పోరాటాల్లో లెఫ్ట్ అగ్రభాగాన నిలిచిందని విజయన్ తెలిపారు. అన్ని దశల్లోనూ భారత లౌకిక, ప్రజాస్వామికతను పరిరక్షించడం కోసం లెఫ్ట్ కట్టుబడినట్లు వెల్లడించారు.

పరీక్షల్లో తప్పిన వ్యక్తి ప్రధాని ఎలా అయ్యారో?

రాజీవ్ గాంధీపై మణిశంకర్ అయ్యర్ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి తన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీని ఇరుకున పడేశారు. ఈసారి ఆయన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని ఉద్దేశించి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన రెండు సార్లు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని.. అలాంటి వ్యక్తి దేశ ప్రధాని ఎలా అయ్యారోనంటూ వ్యాఖ్యానించారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నేను, రాజీవ్ గాంధీ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో కలిసి చదువుకున్నాం. నాడు ఆయన పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. విశ్వవిద్యాలయం విద్యార్థులను ఉత్తీర్ణులు చేయాలనే ప్రయత్నిస్తుంది. కానీ, రాజీవ్ మాత్రం విఫలమయ్యారు. ఆ తర్వాత లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో కూడా ఫెయిల్ అయ్యారు. చదువు విషయంలో ఆయన చాలా కష్టపడ్డారు. అయినప్పటికీ ఉత్తీర్ణత సాధించలేకపోయారు. రెండు సార్లు విఫలమై, పైలట్‌గా పని చేసిన వ్యక్తి దేశ ప్రధాని అవుతారని నేను ఊహించలేదు. ఇది ఎలా సాధ్యమైందో" అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియోను భాజపా నేత అమిత్ మాలవీయా 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు. 'ఆయనను ముసుగు తొలగించనివ్వండి' అంటూ విమర్శించారు. ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. మణి శంకర్ గతంలోనూ సొంత పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాజకీయాల్లో తన ఎదుగుదలకు, పతనానికి 'గాంధీ కుటుంబమే' కారణమన్నారు. పదేళ్లలో పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీతో ఒక్కసారి కూడా సమావేశం అయ్యేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో కూడా ఒకటి, రెండు సార్లు మాత్రమే భేటీ అయినట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చిన్న నేతలకు సరైన గుర్తింపు ఉండదన్నారు.

జమ్మూలో భారీగా హిమపాతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని సోన్‌మార్గ్‌లో బుధవారం భారీ హిమపాతం సంభవించింది.అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు పేర్కొన్నారు. భారీ ఎత్తున మంచు దూసుకువస్తున్న దృశ్యాలను చూసిన వెంటనే స్థానికులు అప్రమత్తమై సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని ఛమోలీ జిల్లాలోని మనా గ్రామం వద్ద భారీ హిమపాతం కురవడంతో అక్కడ పనులు చేస్తున్న కార్మికుల్లో 55 మంది వాటి కింద చిక్కుకుపోయారు. వారిలో 47మందిని రక్షించగా.. ఎనిమిది మంది మంచు చరియల కింద చిక్కుకొని మరణించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏటా శీతాకాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడుతుంటాయి. ఈ చరియలు 5 సెకన్ల కాలంలోనే గంటకు 80 మైళ్ల వేగంతో కిందకు జారుకుంటాయి. ఇలాంటి ఘటనల్లో 2.3 లక్షల ఘనపు మీటర్ల వరకూ మంచు విడుదలవుతూ ఉంటుంది. అంటే 20 ఫుట్‌బాల్ మైదానాలను 3 మీటర్ల మందం వరకూ కప్పిన హిమంతో సమానం. దీనినే అవలాంచ్ అంటారు.

అసెంబ్లీ ఆవరణలో గుట్కా తినడం నిషిద్ధం

యూపీ స్పీకర్ ఆదేశం...ఎమ్మెల్యే నిర్వాకంపై ఆగ్రహం

లక్నో: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా తినడంపై నిషేధం విధిస్తూ స్పీకర్ సతీశ్ మహాన ఆదేశాలు జారీ చేశారు. యూపీ అసెంబ్లీ కొనసాగుతున్న క్రమంలో ఓ ఎమ్మెల్యే గుట్కా తిని కార్పెట్‌పై ఉమ్మివేయడంపై స్పీకర్ సతీశ్ మహాన ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన ఇకపై అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా తినడంపై నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం బడ్జెట్ సమావేశం జరగడానికి ముందు అసెంబ్లీలోకి వస్తున్న సమయంలో కార్పెట్‌పై గుట్కా గుర్తులను స్పీకర్ గమనించారు. "ఈ నిర్వాకం చేసిన ఎమ్మెల్యే ఎవరో నాకు తెలుసు. వీడియోలో నేనంతా చూశాను. కానీ, ఎవరినీ కించపరచాలని అనుకోవడం లేదు. అందుకే వారి పేరును ప్రస్తావించను. ఎవరైన ఇకపై ఇలాంటి పని చేస్తున్నట్లయితే మిగిలిన సభ్యులు దాన్ని అడ్డుకోవాలని కోరుతున్నాను. అసెంబ్లీని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత. ఇలా చేసిన ఎమ్మెల్యే వచ్చి తప్పును అంగీకరిస్తే బాగుంటుంది. లేదంటే అతడిని నేనే పిలుస్తాను" అని సతీశ్ మహాన హెచ్చరించారు. అనంతరం దగ్గరుండి కార్పెట్‌ను శుభ్రం చేయించారు. ఒక వ్యక్తి చేసిన పనికి మిగిలిన వారి గౌరవం ఎందుకు దెబ్బతినాలంటూ స్పీకర్ ప్రశ్నించారు. అసెంబ్లీ ప్రజలకు చెందిందని.. ఇదేమీ వ్యక్తిగత ఆస్తి కాదంటూ మండిపడ్డారు. అసెంబ్లీలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే.. మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా, పాన్ మసాలా వినియోగించడంపై ఆయన నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ. 1000 జరిమానా విధించనున్నారు.

కేజ్రీవాల్ భద్రతపై విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: పంజాబ్ రాష్ట్రం హోషియార్‌పూర్‌లోని 'విపశ్యన' ధ్యాన కేంద్రానికి కంచుకోట వంటి భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వెళ్లడం రాజకీయ విమర్శలకు దారితీసింది. సామాన్యుడనని చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్ అసలు రూపం మరోసారి బయటపడిందంటూ విపక్షాలు మండిపడుతున్నాయి. కేజ్రీవాల్ భారీ భద్రతపై ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మాలివాల్ 'ఎక్స్'లో చురకలు వేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భద్రతతో కేజ్రీవాల్ భద్రతను పోల్చారు. 'వీఐపీ సంస్కృతి అంటూ యావత్ ప్రపంచాన్ని ఆడిపోసుకున్న కేజ్రీవాల్ ఈరోజు డొనాల్డ్ ట్రంప్‌కు మించి సెక్యూరిటీతో తిరుగుతున్నారు' అంటూ ఆమె ట్వీట్ చేశారు. కేజ్రీవాల్ 'వీఐపీ మహారాజా'లా తిరుగుతున్నారంటూ బీజేపీ నేత, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సర్సా వ్యాఖ్యానించారు. ఒకప్పుడు వేగనార్‌లో తిరుగుతూ సాధారణ వ్యక్తిలా నటించిన కేజ్రీవాల్ ఇప్పుడు విపశ్యనా ధ్యానకేంద్రానికి భారీ మందీమార్బలంతో వెళ్లడాన్ని ప్రశ్నించారు. ఆయన కాన్వాయ్‌లో బుల్లెట్‌ప్రూఫ్ ల్యాండ్ క్రూయెజర్, 100 మందికి పైగా పంజాబ్ పోలీసు కమెండోలు, జామర్లు, అంబులెన్సులు ఉన్నాయి. ఇదంతా విపశ్యనా కేంద్రానికి ధ్యానం కోసం వెళ్లేందుకు వీఐపీ మహారాజా ట్రీట్‌మెంట్. ఆప్ అసలు రూపం ఏమిటో బయటపడింది. వంచన, హిపోక్రసీ మరోసారి వెల్లడైంది అని అన్నారు. కేజ్రీవాల్ వీఐపీ కల్చర్‌పై కాంగ్రెస్ పార్టీ సైతం విమర్శలు గుప్పించారు. కేజ్రీవాల్ అధికార దాహం గురించి తాను పదేళ్లుగా చెబుతూనే ఉన్నానని, నిరాడంబరత అనేది కేవలం ఒక నాటకమని, అధికారంలోకి వచ్చాక ఆయన విలాసాలకు అంతుండదని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ అన్నారు. మెడిటేషన్ సెంటర్‌కు 100 వాహనాలతో కూడిన కాన్వాయ్‌లో కేజ్రీవాల్ వెళ్లడాన్ని ఆయన నిలదీశారు. కాగా, కేజ్రీవాల్ తన భార్య సునీతతో కలిసి ఈనెల 15 వరకూ ధ్యాన కేంద్రంలో ఉంటారు.

మనవరాలి సోషల్‌మీడియా స్నేహం...

నానమ్మ బ్యాంక్ ఖాతా ఖాళీ

రూ.80 లక్షలు కొట్టేసిన మోసగాడు

చండీగఢ్: హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ఒక యువకుడితో సోషల్ మీడియాలో స్నేహం చేసి మోసపోయింది. తన కుటుంబానికి భారీ ఆర్థిక నష్టాన్ని తెచ్చిపె ట్టింది. అతగాడు విద్యార్థిని ఫొటోను ఎడిట్ చేసి అశ్లీలంగా మార్చాడు. దాన్ని చూపించి ఆమెను బెదిరించాడు. డబ్బులు ఇవ్వకుంటే, ఆ ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానన్నాడు. అతడి బెదిరింపులకు భయపడిన బాలిక తన బామ్మ బ్యాంకు ఖాతాల నుంచి నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బులు పంపడం ఆరంభించింది. ఇలా నెలల తరబడి సదరు బాలికను బెదిరించి, దాదాపు రూ.80 లక్షలను సదరు మోసగాడు దోచుకు న్నాడు. తన బాధను ఇంట్లో ఎవరితోనూ చెప్పుకోలేకపోయిన బాధిత విద్యార్థిని, చివరకు ఈ విషయాన్ని తన ఆప్త మిత్రురాలికి తెలియజేసింది. ఆ మిత్రురాలు వెంటనే బాధిత విద్యార్థిని కుటుంబ సభ్యులకు వివరాలన్నీ చెప్పింది. దీంతో బాధిత బాలిక కుటుంబ సభ్యులు 2024 డిసెంబరు 21న ఈ అంశంపై గురుగ్రామ్‌లోని సెక్టార్-10 పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక సోషల్ మీడియా ఖాతాల చాటింగ్ హిస్టరీ, బ్యాంకు అకౌంట్ల సమాచారం ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు కీలక నిందితుడిని గుర్తించారు. గురుగ్రామ్‌లోని గడీ హర్‌సరూ ఏరియాలో ఉన్న హయత్‌పూర్ రోడ్ కాలనీకి చెందిన నవీన్ కుమార్‌ను సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.5.13 లక్షల నగదును, బాధిత బాలిక డెబిట్ కార్డును రికవర్ చేశారు. విద్యార్థినిని బ్లాక్ మెయిల్ చేసిన ఈ కేసులో ఇప్పటి వరకు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సెక్టార్-10 పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ రాంబీర్ తెలిపారు. విచారణలో అనేక ముఖ్యమైన ఆధారాలు లభించాయన్నారు. బాలికను బ్లాక్ మెయిల్ చేసిన ఈ ముఠాలో ఇంకా ఎక్కువ మంది నిందితులు ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు. నిందితులందరికీ శిక్ష పడుతుందని విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులకు పోలీసులు హామీ ఇచ్చారు.

రూ.కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ చేస్తూ చిక్కిందిలా...

అధికారులకు పట్టుబడిన నటి రన్యారావు

బెంగళూరు: కన్నడ నటి, సీనియర్ ఐపీఎస్ కుమార్తె రన్యారావు... దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.2 కిలోల బంగారంతో వచ్చిన ఆమెను విమానాశ్రయం నుంచి నిష్క్రమిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఇంట్లోనూ సోదాలు చేయగా రూ.రెండు కోట్ల విలువైన ఆభరణాలు, మరో రూ.రెండు కోట్లకుపైగా నగదు లభ్యమయ్యాయి. మొత్తం రన్యారావు నుంచి రూ.17.29 కోట్ల విలువైన బంగారం, నగదు సీజ్ చేసినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు వెల్లడించారు. రన్యారావు ఇటీవల గల్ఫ్ దేశాలకు తరుచూ వెళ్లివస్తున్నట్లు నిఘా అధికారులు గుర్తించారు. ఈ ఏడాదిలోనే దాదాపు 10 సార్లు వెళ్లి రావడం అనుమానాలకు తావిచ్చింది. గడిచిన పదిహేను రోజుల్లోనే నాలుగు సార్లు వెళ్లి వచ్చింది. దుబాయ్‌కు వెళ్లిన ప్రతిసారి ఒకే రకమైన దుస్తులు ధరించినట్లు సమాచారం. అప్రమత్తమైన డీఆర్ఐ అధికారులు... ఆమె రాకపోకలపై నిఘా పెట్టారు. ఇటీవల దుబాయ్ నుంచి కెంపేగౌడ విమానాశ్రయంలో దిగిన రన్య... సాధారణ ప్రయాణికురాలి మాదిరిగానే భద్రతా తనిఖీలు పూర్తి చేసుకుంది. ఓ కానిస్టేబుల్ సాయంతో నిష్క్రమణ మార్గం వైపు వెళ్లింది. అప్పటికే అక్కడ కాపుకాస్తున్న డీఆర్ఐ అధికారులు రన్యను అడ్డుకొని తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆమె బెల్టులో కిలోల కొద్ది బంగారం బయటపడింది. అరెస్టు అనంతరం దర్యాప్తు చేపట్టిన అధికారులకు రన్య రావు కీలక విషయాలు చెప్పినట్లు సమాచారం. స్మగ్లింగ్ చేయాలని తనను కొందరు బ్లాక్‌మెయిల్ చేశారని వివరించినట్లు తెలుస్తోంది. అయితే, ఎయిర్‌పోర్టులో రన్యకు సాయం చేసిన ఓ కానిస్టేబుల్ స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేశారు. త్వరలోనే ఆమె భర్తను కూడా పోలీసులు విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రన్యాతో సంబంధాలు లేవు...

రన్య తండ్రి కె. రామచంద్రారావు కర్నాటక డీజీపీ (పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్)గా పనిచేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. అయితే, రన్యాకు ఈయన సవతి తండ్రి అని తెలిసింది. బంగారం స్మగ్లింగ్ చేస్తూ రన్యారావు పట్టుబడిన ఘటనపై సీనియర్ ఐపీఎస్ రామచంద్రారావు ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. ఆమె కార్యకలాపాలతో ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. నాలుగు నెలల క్రితమే ఆమెకు వివాహం అయిందని, అప్పటి నుంచి తమ ఇంటికి రాలేదన్నారు. భర్తతో పాటు ఆమె ఎటువంటి వ్యాపార లావాదేవీలు చేస్తున్నారనే విషయం తమకు తెలియదన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. రన్యారావు అరెస్టుపై కర్నాటక హోంమంత్రి జి. పరమేశ్వర స్పందించారు. కేసును డీఆర్ఐ దర్యాప్తు చేస్తోందని, దీనిపై ఏమీ చెప్పలేనన్నారు. ఈ కేసును అంతర్గతంగా పరిశీలించాలని పోలీసుశాఖకు సూచించానని వెల్లడించారు.

రన్యారావుది కర్నాటకలోని చికమంగళూరు. బెంగుళూరు దయానంద్ సాగర్ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందారు.

2014లో ఆమె చిత్ర రంగంలో ప్రవేశించింది. మానిక్య చిత్రంలో ఆమె కన్నడ సూపర్‌స్టార్ సుదీప్‌తో కలిసి నటించారు. 2016లో రిలీజైన తమిళ చిత్రం వాఘాలో కూడా ఆమె నటించింది. విక్రమ్ ప్రభు ప్రధాన పాత్ర పోషించాడు. 2017లో రిలీజైన కన్నడ కామిడీ చిత్రం పటాకీలో ఆమె నటించింది. గణేశ్ హీరోగా నటించాడు.

విశాలాంధ్ర హైదరాబాద్

నీట్ పరీక్షా కేంద్రాలపై నివేదిక సమర్పించండి

మే 4న జరిగే పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలి

అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మే 4న జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజి పరీక్ష నిర్వహణ కోసం హైదరాబాద్ జిల్లాలో పరీక్షా కేంద్రాలను గుర్తించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మే 4న జరగనున్న జాతీయ అర్హత ప్రవేశపరీక్ష నీట్ యూజి-2025 పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ అర్హత పరీక్ష కోసం పరీక్ష కేంద్రాలను జిల్లాలో గల కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రైల్వే స్కూల్స్, ఆర్మీ స్కూల్స్, ఇంజనీరింగ్ కళాశాలలు, సెంట్రల్ యూనివర్సిటీలు, సిబిఎస్ఈ పాఠశాలలు, జవహర్ నవోదయ విద్యాలయాలు అలాగే ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలను సందర్శించి అందులో ఉన్నంటువంటి మౌలిక వసతులు అలాగే చేపట్టాల్సిన చర్యలపై సత్వరమే నివేదిక అందించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

నీట్ పరీక్ష నిర్వహణ కోసం పరీక్ష కేంద్రాల ఎంపికకు నియమ నిబంధనల ప్రకారం అందులో ఉండాల్సిన మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. జిల్లాలో దాదాపు 35 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాసే వీలున్నందున పరీక్ష నిర్వహణ రోజున అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పరీక్ష రాసేందుకు వీలుగా బెంచీలు, కుర్చీలు, తాగునీరు, మూత్రశాలలు, సీసీ కెమెరాల పనితీరు, తరగతి గదులు, లైటింగ్, ఫ్యాన్లు, భద్రత దృష్ట్యా ప్రహారి గోడ, విద్యుత్ సరఫరా, తదితరాల వంటి సౌకర్యాలను పర్యవేక్షించి డివిజన్ల వారీగా తహసీల్దార్లు కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై నివేదిక అందించాలని ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందని అలాగే ప్రతి గదికి 24 మంది అభ్యర్థులు పరీక్ష రాసేలా గదులు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఈ.వెంకటాచారి, డిఈఓ ఆర్.రోహిణి, డిఐఈఓ ఒడ్డెన్న, అదనపు డిసిపి నర్సింహారావ్, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.శైలజ, ప్రిన్సిపాల్ కేంద్రీయ విద్యాలయాలు సవిత రాణి, రూపెందర్ సింగ్, సురేష్ కటోచ్, ఆర్డిఓలు రామకృష్ణ, సాయిరాం, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

తపస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా సాగునీటి కష్టాలు లేకుండా చేస్తాం : ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం తపస్ పల్లి రిజర్వాయర్ ద్వార చెరువులు, కుంటలు నింపి రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చేస్తామని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తపస్ పల్లి రిజర్వాయర్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తపస్ పల్లి రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయకపోవడంతో రిజర్వాయర్‌లో నీటి శాతం పూర్తిగా పడిపోయాయన్నారు. దాంతో చెరువులు, కుంటలు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటి పోవడంతో సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ధర్మసాగర్, బొమ్మకూరు నుండి నీటిని విడుదల చేసి ఈ ప్రాంతంలో ఉన్న కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని మళ్లించి రైతుల పంటలకు సాగునీరు అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రిజర్వాయర్‌లోకి నీటి మళ్లింపులో జరుగుతున్న ఇబ్బందులను నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి నీటి సమస్య లేకుండా చూస్తానని అలాగే ఈ ప్రాంత రైతులు, అధికారులతో సమీక్షలు నిర్వహించి వారి అభిప్రాయాలతో నీటి సరఫరాలో జరుగుతున్న సమస్యలను పరిష్కరించి రానున్న ఎండకాలంలో అన్ని ప్రాంతాల రైతులకు సాగు, తాగునీటి కష్టాలు లేకుండా చేస్తానని భరోసా కల్పించారు. అనంతరం చేర్యాల మండలంలోని అర్జున్ పట్ల, కమలాయపల్లి గ్రామాల్లో పర్యటించి తపాస్పల్లి రిజర్వాయరుకు సంభందించిన డి3, రంగనాయక్ సాగర్ ఎల్డి10 కాలువలను పరిశీలించి స్థానిక రైతులు, అధికారులతో చర్చించి సాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.

హామీలను అమలు పరిచేందుకు క్యాబినెట్లో చర్చించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు పరిచేందుకు గురువారం జరగనున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ బిల్లు శాసనసభలో ఆమోదించి కేంద్రానికి త్వరలో పంపి చట్టబద్ధతకై ఒత్తిడి తేవాలన్నారు. బీసీల రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. బీసీలకు బడ్జెట్లో సంవత్సరానికి రూ.20 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని హామీ ఇచ్చి గత బడ్జెట్లో 9200 కోట్లే కేటాయించి అన్యాయం చేశారని, రానున్న బడ్జెట్లో గతంలో తగ్గించిన 10,800 కోట్లు కలుపుకొని 30,800 కోట్లు కేటాయించి బీసీల సమగ్ర అభివృద్ధికి సంక్షేమానికి నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అత్యంత వెనుకబడిన కులాల సంక్షేమానికి సమగ్ర అభివృద్ధి కోసం ఎంబిసి మంత్రిత్వ శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. బీసీ ఫెడరేషన్లు పునరుద్ధరించి పాలకమండలిలను ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలన్నారు. చేనేత, గీత, మత్స్య, క్షౌర, రజక, గొర్రెల పెంపకందారుల, కంసాలి, కంచరి, కమ్మరి, వడ్రంగి, కుమ్మరి తదితర చేతివృత్తుల వారికి ఇచ్చిన అనేక హామీలు అధికారంలోకి వచ్చి 15 మాసాలు గడిచిన అమలుపరిచేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

అత్తాపూర్‌లో ఆర్ఎస్ బ్రదర్స్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కుటుంబసమేతంగా షాపింగ్ చేయదగిన ఆర్.ఎస్.బ్రదర్స్ అత్తాపూర్‌లో తమ 13వ షోరూమును బుధవారం ప్రముఖ తెలుగు సినీనటి నిధి అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్తక, వాణిజ్యాలలో సుదూర దృష్టి కలిగిన పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు, దివంగత పి.సత్యనారాయణ ఆర్.ఎస్.బ్రదర్స్ సంప్రదాయాన్ని ఆధునిక ఫ్యాషన్‌తో మిళితం చేస్తూ కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ వాసులందరికీ అసాధారణమైన షాపింగ్ అనుభవాన్ని అందించే ఈ బ్రాండ్ ప్రయాణంలో ఈ తాజా విస్తరణ మరో మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. ముఖ్యంగా వివాహ వేడుకలు, రంజాన్ కలెక్షన్లపై ఆకర్షణీయమైన ప్రారంభ ఆఫర్లను వినియోగించుకోవాలని కోరారు.

కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవ కార్యక్రమాలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ భవన్‌లో చలి వేంద్రం ప్రారంభించడం జరిగింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడలు, నృత్యం, సాంగ్స్ వంటి కార్యక్రమాలు టిజిఓల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, డిఈఓ విజయకుమారి, టిజిఓ అధ్యక్షులు జి.వినోద్ కుమార్, టిజిఓ కార్యదర్శి డా. కురుమూర్తి, ఎంప్లాయిమెంట్ అధికారి రాధిక, బిసి డెవలప్మెంట్ జాన్సీ, యూత్, స్పోర్ట్స్ డిపార్ట్మెంటు గోపాల్‌రావు, ఎల్.డి.ఎం శివ ప్రసాద్, టిజిఓ ఉపాధ్యక్షులు రవీందర్, జిల్లా టిజిఓ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ హరిప్రియ మాట్లాడుతూ మహిళా దైనందిన జీవితంలో మహిళల పాత్ర, మహిళా శక్తి, మహిళల ధైర్య సాహసాలు, ఓర్పు సహనం గురించి క్లుప్తంగా వివరించారు.

టీబీఎం చివరి భాగంలో శిథిలాల తొలగింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : టన్నెల్ బోరింగ్ మిషన్ చివరి భాగంలోనీ శిథిలాలను తొలగించడం జరిగిందని డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తూ శిథిలాలను తొలగిస్తూ గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ గుర్తించిన సర్ఫేస్ డిస్టర్బెన్స్ ప్రాంతాలలో మట్టితీత పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. డి వాటరింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతుందని, టన్నెల్ బోరింగ్ మిషన్ ఎడమవైపు నుండి వాటర్ జెట్‌ల ద్వారా బురదను తొలగించే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న సహాయక బృందాలు సమన్వయంతో నిరంతరం శ్రమిస్తున్నాయని వివరించారు. ఎస్సెల్బిసి టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ సహాయక చర్యల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం ఎస్సెల్బిసి టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో, సహాయక చర్యలను సమీక్షించేందుకు డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సహాయక బృందాలు కొనసాగిస్తున్న పనులను విభాగాల వారీగా విశ్లేషించారు. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కల్నల్ పరీక్షిత్ మెహర టన్నెల్ బోరింగ్ మెషిన్ నమూనాతో అధికారులకు టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలను వివరించారు. రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న సహాయక బృందాలుతో పాటు ఢిల్లీ నుండి వచ్చిన నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం, ఎస్సెల్బిసి టన్నెల్ ప్రమాద ప్రదేశంలో రోబోటిక్ సేవల కొరకు హైదరాబాద్‌కు చెందిన ఎన్వీ రోబోటిక్స్ ప్రతినిధుల బృందం టన్నెల్లోకి వెళ్లినట్లు తెలిపారు. టన్నెల్ బోరింగ్ మిషన్ ఎడమవైపు నుండి వాటర్ జెట్‌ల ద్వారా బురదను తొలగించే పనులు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాల ద్వారా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. టన్నెల్‌లో పల ఉన్న టన్నెల్ బోరింగ్ మిషన్ పై పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు వాటర్ జెట్‌లను ఉపయోగించుకున్నట్లు వాటి పని తీరును అధికారులకు డెమో ద్వారా చెప్పారు. కన్వేయర్ బెల్టు పునరుద్ధరించామని దానికి సంబంధించిన కమీషనింగ్ పని పూర్తి చేస్తున్నట్లు, రెస్క్యూ ఆపరేషన్‌లో ఎదుర్కొంటున్న ఆటంకాలను అధిగమిస్తూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు తెలిపారు. టన్నెల్ లోపల వెంటిలేషన్, లైటింగ్ సదుపాయాలను ముందుకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, టీఎస్ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్ఎఫ్ అధికారి ప్రసన్న, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎస్డీఆర్ఎఫ్ అధికారి, ఫైర్ సర్వీసెస్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా లక్నో డైరెక్టర్ అయోధ్య ప్రసాద్ తప్లియాల్, హైదరాబాదు డైరెక్టర్ శైలేంద్ర కుమార్, దక్షిణ మధ్య రైల్వే డివిజన్ మెకానికల్ ఇంజనీర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

కాసా గ్రాండ్ 4 కొత్త ప్రాజెక్టులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మా వినియోగదారులకు నాణ్యమైన నిర్మాణాలు చేయడమే మా ప్రధాన లక్ష్యం అని కాసా గ్రాండ్ ఫౌండర్, ఎండి.అరుణ్ ఎంఎన్ తెలిపారు. తాజాగా తమ సంస్థ హైదరాబాద్ నగరంలో నాలుగు ప్రధానమైన ప్రాంతాల్లో తమ నిర్మాణాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయనతో పాటు సంస్థ హైదరాబాద్ హెడ్ డైరెక్టర్ సాయి ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ సంస్థ నగరంలోని కొంపల్లి, మొంకల్, అత్తాపూర్‌లో ఈ నిర్మాణాలు చేస్తున్నట్లు వివరించారు. వీటి నిర్మాణాలు వచ్చే 6 నుండి 36 నెలల్లో పూర్తి చేసి వినియోగదారులకు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. అలాగే వచ్చే 6 నెలల్లో మరో 4 కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వీటిని కొంపల్లి, బాచుపల్లి, మేడ్చల్‌లోని ఓఆర్ఆర్ సమీపంలో చేపట్టనున్నట్లు వివరించారు. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టుల విలువ సుమారు రూ. 2500 కోట్లు ఉంటుందని అన్నారు. వీటిలో మిడ్ రైస్ అపార్ట్మెంట్, హై రైస్ అపార్ట్మెంట్, విల్లాలు ఉన్నాయన్నారు. వీటి విలువ రూ.కోటి 40 లక్షల నుండి 4 కోట్ల వరకు ఉన్నాయన్నారు. త్వరలోనే తాము ఆంధ్రప్రదేశ్ లోని వైజాగ్, అమరావతిలో కూడా తమ నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం దేశంలో హైదరాబాద్ మార్కెట్ నిర్మాణ రంగానికి అనువుగా ఉందన్నారు. తమ సంస్థ నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తమ ప్రాజెక్టుల ఎంపికలో కొనుగులు చేసే వారికి అని రకాల సౌకర్యాలను కల్పించడంతో పాటు వారికి అభిరుచులకు అనుగుణంగా నిర్మాణాలు ఉంటాయన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని దివిటిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పడిన ప్రాథమిక మత్స్యకార సహకార సంఘం రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలే కాదు పురుషులు కూడా పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదగవచ్చు అని ముదిరాజ్ సోదరులు పొదుపు సంఘం ఏర్పాటు చేసి నిరూపించారని ఆయన అన్నారు. ముదిరాజ్ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొదుపు సంఘాన్ని ప్రోత్సహించడం కోసం లక్ష రూపాయలు విరాళం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవనాన్ని ముడా నిధులతో నిర్మాణం చేస్తామని, అందుకోసం ఎస్టిమేషన్ తయారు చేసి ఇవ్వాలని ఆయన ముదిరాజ్ సంఘం సభ్యులకు సూచించారు. రానున్న రోజుల్లో దివిటిపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని ఆయన చెప్పారు. అందుకే ఈ గ్రామాన్ని మున్సిపల్ కార్పొరేషన్‌లో చేర్చడం జరిగిందని గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు అరకొరగా వస్తాయని, అదే కార్పోరేషన్‌లో అయితే ప్రతి వార్డుకు అభివృద్ధి పనులకు కోటి రూపాయల వరకు వస్తాయని ఆయన చెప్పారు. చెరువులను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, చెరువుల సంరక్షణ కోసం మైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి చెరువులు అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గంజి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అనుప ఆంజనేయులు, జె.చంద్రశేఖర్, సిరిగిరి మురళీధర్, కోస్గి శివప్రసాద్ రెడ్డి, చర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మీరంతా భావి భారత పౌరులు...

మీరంతా భావి భారత పౌరులు అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బిఇడి కళాశాలలో సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ విద్యాలయాలు, హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాలయాలు, హాస్టల్స్ సందర్శించి అక్కడ నెలకొన్న పలు సమస్యలను తెలుసుకొని, అత్యవసరమైన సమస్యలు ఏమైనా ఉంటే వాటిని అప్పటికప్పుడే పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. గతంలో వలసల జిల్లాగా పేరుగాంచిన మహబూబ్‌నగర్ ఇప్పుడు చదువుల తల్లి సరస్వతి నిలయంగా అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఈ విద్యా నిధికి తమ ఒక రోజు జీతాన్ని అందిస్తున్నారని అందులో భాగంగానే జిల్లా ఎస్పీ డి.జానకి వారి సిబ్బంది విద్యా నిధికి విరాళాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ సైతం ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఈ విద్యా నిధికి సహకారం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు తిరుమల వెంకటేష్, పాపారాయుడు, అనిల్ నాయక్, యేసుదాస్, కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

జలమండలి మహిళా ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యంలో జలమండలి ఉద్యోగినులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి, జలమండలి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ మెడికల్ క్యాంప్‌ను ఎండీ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం జరిగింది. ఇందులో 100 మందికిపైగా మహిళా ఉద్యోగులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వీరికి బీపీ, షుగర్, ఈసీజీ, కంటి చూపు, దంత తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి వైద్యురాలు డా.ఎం.మాధవి, ఫైనాన్స్ సీజీఎం కేదారేశ్వరి, జలమండలి ఉమెన్స్ మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, జనరల్ సెక్రటరీ బిల్కిస్ బాను, బోర్డు మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

డీ-లిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను డీ - లిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని, కేవలం ఉత్తరాది రాష్ట్రాలు లాభ పడతాయని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఎంపీ స్థానాల విధానాన్నే కొనసాగించాలని వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపధికన లోక్‌సభ స్థానాలను డీ లిమిటేషన్ చేస్తే జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే లాభం జరుగుతుందని వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల దక్షిణాది రాష్ట్రాలలో జనాభా సంఖ్య తక్కువగా ఉందని వినోద్ కుమార్ తెలిపారు. 1971 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుని లోక్‌సభ స్థానాలను నిర్ణయించారని, ఇక ముందు కూడా ఇదే పద్ధతిని కొనసాగించాలని, అవసరం అయితే అందుకు రాజ్యాంగాన్ని సవరించాలని వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తప్పుపట్టారాని, ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తోందని వినోద్‌కుమార్ అన్నారు. ఉదాహరణకు తీసుకుంటే 1971 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జనాభా 8.8 కోట్లు కాగా, తాజా జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుంటే 24 కోట్లకు చేరుతుందని, దీంతో యూపిలో ఎంపీ స్థానాలు అమాంతం భారీగా పెరుగుతాయని వినోద్ కుమార్ వివరించారు.

రానున్న రోజుల్లో తమ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో కార్యాచరణను రూపొందిస్తామని వినోద్ కుమార్ ప్రకటించారు.

నీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా బీహెచ్ఈఎల్ జంక్షన్ దగ్గర ఫ్లై ఓవర్ నిర్మించనుంది. ఈ నేపథ్యంలో ఈ పనులకు ఆటంకం కలగకుండా ఎన్.హెచ్.ఎ.ఐ వినతి మేరకు అక్కడున్న జలమండలి పీఎస్సీ పైపులైన్ ను వేరే చోటకి మార్చనున్నారు. బీహెచ్ఈఎల్ ఫ్లై వద్దనున్న 1500 ఎంఎం డయా పైపులైన్‌కు జంక్షన్ పనులు చేపట్టనున్నారు. ఇవి ఈ నెల 8న శనివారం ఉదయం 6 గంటల నుంచి అదే రోజు సాయంత్రం 6 గంటల వరకు జరగనున్నాయి. దీంతో ఈ 12 గంటల పాటు కింద పేర్కొన్న ప్రాంతాల్లో కొన్ని చోట్ల నీటి సరఫరాలో అంతరాయం మరికొన్ని చోట్లలో-ప్రెజర్‌తో నీటి సరఫరా జరుగుతుంది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు :

ఓ అండ్ ఎం డివిజన్-6 : ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్., ఓ అండ్ ఎం డివిజన్-9 : కేపీహెచ్బీ కాలనీ, కూకట్ పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట., ఓ అండ్ ఎం డివిజన్-17 : ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనా గూడ, మియాపూర్., ఓ అండ్ ఎం డివిజన్-22 : దీప్తి శ్రీ నగర్, బీరంగూడ, అమీన్ పూర్, నిజాంపేట్ కావున అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు సూచించారు.

IN THE COURT OF THE 1st ADDL. DISTRICT JUDGE :: ONGOLE

EA NO. 324/2024 IN EP No. 5/2003 IN OS No. 12/1999
Sale Certificate No. 4/2003

Between:
VEMURI SRINIVASULU
- PETITIONER/AUCTION PURCHASER.
AND
PINIKINI GRAMEENA BANK, ONGOLE & OTHERS
- RESPONDENTS/J.DrS.

NOTICE

To
KORISAPATI JANARADHANA REDDY, S/o. Rosi Reddy, Age 41years, Hindu, Business, Next House of Janachaitanya Apartments, AS Rao Nagar, HYDERABAD, Cell No. 8639631524.

The petitioner/Auction purchaser filed the above petition for relief in the above petition/ case. If you have got any objection you may appear before this honarable court at **10-30 AM., on 24th March, 2025** either in person or through an advocate and filed your objection If you fail to do so, the matter will be decided as per law and records.

(BY ORDER IN THE NAME OF THE HON'BLE COURT)

BADDIPUDI SRINIVASA RAO, ADVOCATE,
35-4-69, Sitarampuram, ONGOLE

ఎల్ఆర్ఎస్‌పై హెచ్ఎండిఏలో వర్క్‌షాపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఏ) ఎల్ఆర్ఎస్‌పై బిఆర్‌కె భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్ బుధవారం సమావేశం నిర్వహించారు. లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, ఆర్కిటెక్ట్‌లతో ఎల్ఆర్ఎస్-2020పై వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ వర్క్ షాపులో దాదాపు 160 మంది లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, ఆర్కిటెక్ట్‌లతో పాటు హెచ్ఎండిఏ ప్లానింగ్ డైరెక్టర్లు, ప్లానింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. హెచ్ఎండిఏ లోని ప్లానింగ్ డైరెక్టర్లు మరియు ప్లానింగ్ ఆఫీసర్లు కూడా పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీ.వోపై కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వివరించారు. ఈ నెల 31 వరకు క్రమబద్దీకరణ కోసం పూర్తి స్థాయిలో చెల్లింపులు చేసిన వారికి 25శాతం రాయితీని ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. నిషేదిత భూములు, చెరువు, ఎఫ్‌టిఎల్ నుండి 200 మీటర్ల పరిధిలో లేని ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల కోసం ఫీజు నోటీసులు జనరేట్ అవుతాయని, ఈనెల 31 లోపు చెల్లిస్తే 25 శాతం రాయితి పొందవచ్చన్నారు. సమావేశంలో పాల్గొన్న వారు అడిగిన పలు ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇచ్చారు. అంతేకాక సెంటర్ ఫర్ గెడ్ గవర్నెన్స్ ప్రతినిధులు ఎల్ఆర్ఎస్ దరఖాస్తు సాఫ్ట్‌వేర్‌పై వివరించారు. దరఖాస్తుదారులకు ఏవైన సందేహాలు ఉన్నట్లైతే హెచ్ఎండిఏలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 1800 599 8838లో కాల్ సెంటర్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్మనీలోని బెర్లిన్ ఎక్స్ పో సెంటర్ సిటీలో మార్చి 4-6 వరకు జరగనున్న ఇంటర్నేషనల్ బిజినెస్ ట్రేడ్ (ఐటీబీ) సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం తరపున పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సదస్సుకు ఆయనతో పాటు పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, జర్మనీలోని భారత రాయబారి అజిత్ గుప్తే, బెర్లిన్ మేయర్ కయ్ వేగ్నర్‌తో కలిసి పటేల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. బెర్లిన్ చేరుకున్న రాష్ట్ర పర్యాటక బృందానికి ప్రవాస భారతీయుల ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ ట్రేడ్‌లో తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ, బోనాల విశిష్టతను తెలియజేస్తూ తెలంగాణ ఆడపడచులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ సీయం రేవంత్‌రెడ్డి సారథ్యంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశంలో తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, నూతన పర్యాటక విధానాన్ని 2025-2030 త్వరలోనే తీసుకురానున్నట్లు తెలిపారు. తెలంగాణ పర్యాటక కొత్త పాలసీ విధి విధానాలు, పర్యాటక రంగంలో పెట్టుబడుల అవకాశాలు, పెట్టుబడులకు ప్రోత్సాహకాలు, రాయితీల సహకారం, తదితర విషయాలను ఆయన వివరించారు. తెలంగాణ ఘన చారిత్రక, వారసత్వ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, కళల, వైభవ, ప్రాభవాలకు తెలంగాణ ప్రతీకని, ఆకర్షణీయమైన ప్రకృతి అందాలకు నెలవైన తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పర్యాటక గమ్యస్థానాలు ఉన్నాయని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. తెలంగాణలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, నాగర్జున సాగర్‌లోని బుద్ధవనం, అమ్రబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్, ముత్యాల నగరంగా పేరొందిన హైదరాబాద్‌లో గొల్కొండ కోట, చార్మినార్, కుతుబ్ షాహి టూంబ్స్ వంటి ఎన్నో చారిత్రక ప్రదేశాలున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ దమ్ బిర్యానీకి ప్రత్యేకమైన క్రేజ్ ఉందని పేర్కొన్నారు. టెంపుల్ టూరిజం, మెడికల్ టూరిజం, పర్యావరణ టూరిజం ఇలా వివిధ రకాల పర్యాటకాలతో వర్ధిల్లుతున్న తెలంగాణ దేశ, విదేశీ పర్యాటలకును విశేషంగా ఆకర్షిస్తున్నదని, ఇన్ని ప్రత్యేకతలు ఉన్న తెలంగాణను సందర్శించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ నెల 4 నుంచి 6 వరకూ జరిగే ఈ ట్రేడ్ ఫెయిర్లో 400 మందికి పైగా అంతర్జాతీయ నిపుణులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో 200 సెషన్లు, 17 థీమ్డ్ ట్రాక్స్ ప్రదర్శిస్తారు. ప్రఖ్యాత హెటళ్ళు, పర్యాటక బోర్డులు, టూర్ ఆపరేటర్లు, సిస్టమ్ ప్రొవైడర్లు, పరిశ్రమల ప్రతినిధులు, ట్రావెల్ ఎక్స్పర్ట్స్ పాల్గొంటున్నారు. ప్రధానంగా సాంకేతిక పరివర్తన (డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్), సుస్థిరాభివృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మార్కెట్ ట్రెండ్స్ ఈ సదస్సు జరుగుతోందన్నారు. వేగవంతమైన పర్యాటకాభివృద్ధికి సరికొత్త వ్యూహాలపై చర్చించి, అమలు చేసేందుకు ఈ సదస్సు ఎంతో దోహదపడుతుంది.

భవిష్యత్తు కార్యక్రమాలు ముందుండి నడిపించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: యాదవ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో రేపటి భవిష్యత్తు కార్య క్రమాలకు ముందుండి నడిపించాలని, మీ సలహాలు, మాకు అందించాలని, యాదవ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో సూరజ్ మండల్ యాదవ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వట్టే జానయ్య యాదవ్, యాదవ రాజ్యాధికార సాధన సమితి రాష్ట్ర సలహాదారులు బేరి రామచంద్ర యాదవ్, యాదవ రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడుగుల నాగార్జున యాదవ్, దాసరి నగేష్ యాదవ్, కేశబోయిన మల్లయ్య యాదవ్, సాయన్న ముదిరాజ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

విశాలాంధ్ర- బషీర్ బాగ్: మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో రక్షణ, సాధికారత, సమానత్వం కోసం మహిళా దినోత్సవం జయప్రదం చేయాలని మహిళా శక్తి ఆమ్ ఆద్మీపార్టీ మహిళా నేతలు అడ్వొకెట్ యమునా గౌడ్, సుధారాణి, డాక్టర్ లక్ష్మా నాయుడు, గాజుల మౌనిక పిలుపునిచ్చారు. బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు దాటిన ఇప్పటికీ మహిళలకు స్వాతంత్రం కాదు కదా రోజురోజుకీ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. "బేటి పడావో బేటి బచావో" అనే నినాదం ఇచ్చిన మన ప్రధాని మోడీ, తన బిజెపి పాలక రాష్ట్రాల్లో కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయినా ఆయన మన్ కి బాత్‌లో ఏమి మాట్లాడరన్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు సైతం కీచకులుగా మారి ప్రాణాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు.

రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: నమస్తే శేరిలింగంపల్లి కార్యక్రమంలో భాగంగా 11వ రోజు జనసేన శేరిలింగంపల్లి టీం, డా. మాధవరెడ్డి నేతృత్వంలో లింగంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని సందర్శించింది. పర్యటనలో భాగంగా, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ తీవ్రంగా నిలిచిపోయిన పరిస్థితిని గమనించిన జనసేన శేరిలింగంపల్లి టీం, వెంటనే చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంలో సహాయపడింది. ఇంటర్ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఒక వైపు పరుగులు పెడుతుంటే, మరోవైపు ఉద్యోగులు కార్యాలయాలకు చేరుకోవడానికి ఆత్రంగా ఉంటున్నారు. కానీ జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యపు పనితనమే ఈ పరిస్థితికి కారణమైంది. నెలల తరబడి పట్టించుకోకపోవడంతో రహదారులు మరింత దుర్భరంగా మారాయి. జనసేన ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తోంది. అలాగే లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో చెత్త కుప్పలు పేరుకుపోవడం వల్ల స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు దోమలు పెరిగి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితిని జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే సీరియస్‌గా తీసుకుని ప్రాంతాన్ని శుభ్రం చేయాలని జనసేన డిమాండ్ చేస్తోంది.

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి జనసేన నాయకులు ఉలిసి శ్రీనివాసరావు, రాహుల్, రామాంజనేయులు, సాయి వెంకట్రావు, అడ్డాల భూలోకరావు, సురేష్, జన సైనికులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ పాత్రికేయుల పక్షమే...

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్ : రాష్ట్రంలో ప్రత్యామ్నాయ జర్నలిస్టు యూనియన్‌గా ఏర్పడిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జర్నలి స్టుల ఆదరణతో నేడు నెంబర్ వన్ యూనియన్ గా బలపడిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. రాష్ట్రవ్యాపితంగా జరుగుతున్న ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. బుధవారం మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజుల రామారం సర్కిల్ పరిధి నల్లగుట్ట నరసింహస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ జర్నలిస్టులు శిక్షణతో కూడిన వృత్తి నైపుణ్యతను పెంపొందించుకొని విధినిర్వహణలో సమర్థవంతంగా ముందుకు సాగాలని సూచించారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షాన కాకుండా కేవలం పాత్రికే యుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుం దని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఫెడరే షన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కె సలీమా, తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గుమ్మడి హరి ప్రసాద్, రోజారాణి, నియోజకవర్గం కార్యదర్శి శంకర్, గోవిందరావు, దప్పు రామస్వామి, శివపార్వతి, దామెర జగదీష్ గుప్తా, దుర్గారావు, వీరేష్ ముదిరాజ్, సంజీవ్ కుమార్, శివకుమార్, సత్యనారాయణ, మంజుల రెడ్డి, వెంకట్, బాలరాజు, కావలి మోహన్, శివకుమార్ గౌడ్, లక్ష్మి పాల్గొన్నారు.

బహుజనులకు 15 మంత్రి పదవులు ఇవ్వాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 15 మంత్రి పదవులు ఇవ్వాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన బీసీ కులాల చైతన్య సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం తెలంగాణ రాష్ట్రం నుంచే ప్రారంభించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాష్ట్రంలో బీసీని సీఎం చేయాలని డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాధికారంలో వాటా దక్కలన్నారు. కుల గణనలో వచ్చిన లెక్కలను గ్రామాల వారీగా బహిర్గతపర్చాలన్నారు. దేశంలో విద్య, వైద్యంను జాతీయం చేయాలన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం సంపదను అన్ని వర్గాలకు సమానంగా దక్కలాన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్నవారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జన చైతన్య వేదిక నాయకులు బొయిని మహేష్ యాదవ్, బీసీ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి : కొలను హన్మంత్ రెడ్డి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం 131 డివిజన్ కుత్బుల్లాపూర్ పరిధి బాపునగర్‌లో సీసీ రోడ్ పూర్తిగా పాడవటంతో బస్తీ వాసులు పలు ఇబ్బందులకు గురవుతూ గత నెల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రోడ్డు సమస్యను పరిష్కరించగలరని కోరారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి సమస్యపై సానుకూలంగా స్పందించి వెంటనే ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ ద్వారా నూతన సిసి రోడ్ నిర్మాణానికి రూ. 24,50,000 మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో బుధవారం నిర్వహించిన నూతన సిసి రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో కొలను హన్మంత్ రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్ని ఆయన చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం బస్తి వాసులు కొలను హన్మంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెంటయ్య, గడ్డం రాజేందర్ రెడ్డి, సిద్ధయ్య, ఆగమయ్య, జెస్సి, ఈశ్వర్, వీరేష్, మల్లికార్జున్‌రావు, బాపునగర్ కాలనీ అధ్యక్షులు జగదీష్ గౌడ్, డివిజన్ నాయకులు ఎండీ.జాకీర్, రాధాకృష్ణ, ఖయుమ్, ప్రదీప్, రాజు గౌడ్ మహిళ నాయకురాలు ఏ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి అశ్విని, డివిజన్ మహిళ అధ్యక్షురాలు సుజాత, జ్యోతి, లత, సంగీత, మమత, హైమావతి రెడ్డి, సంగమ్మ కాలనీ వాసులు పాల్గొన్నారు.

శాంతి భధత్రల విషయంలో అందరూ సహకరించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : నేరాలను అదుపు చేయడం, శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులకు అందరూ సహకరించాలని మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ సూచించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని భరద్వాజ కాలనీ అసోసియేషన్ సభ్యులు బుధవారం సీఐ పవన్ కుమార్‌రెడ్డిని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కారించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతం కావడం రోజు రోజుకు ప్రాంతం విస్తరిస్తుందని కాలనీలు కూడా విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అంతే కాకుండా అసాంఘిక కార్యకలపాలకు అడ్డగా కొన్ని కాలనీలు మారాయని పేర్కొన్నారు. నేరాలను అదుపు చేయడం, శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులకు అందరూ సహకరించాలని మొయినాబాద్ సీఐ పవన్కుమార్ సూచించారు. కాలనీల్లో అనుమానస్పద స్థితిలో ఎవరైన కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. సీఐ కలిసిన వారిలో భరద్వాజ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ సలీం, ప్రదాన కార్యదర్శి బ్యాగరి కుమార్, సభ్యులు గఫర్, జాహంగీర్, రవిరాజసాగర్, నర్సింహ్మలు, రమేష్ నాయక్, జైపాల్ రెడ్డి, నరేష్, రాఘురాంరెడ్డి, రఘు. అమితాదవ్, సాజిద్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

విశాలాంధ్ర - మేడిపల్లి: ప్రభుత్వ భూములలో ఓ బీఎస్పీ నాయకుడు కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేశాడు. కాలనీలో ప్రజాప్రయోజనాలకు అవసరం వస్తుందని ప్రశ్నించిన దళిత నాయకుడిపై దౌర్జన్యం చేసిన సంఘ టన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలలోకి వెళితే మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సర్వేనంబర్ 63/1లో ప్రభుత్వ పాఠశాలకు అనుకొని 1200 గజా ల స్థలం ఉంది. ప్రజాప్రయోజనా లకు ఉపయోగించాలని కాలనీ కమిటీ నిర్ణయించింది. దీనిని అసరా తీసుకున్న ఓ బీఎస్పీ నాయకుడు బాలస్వామి తన మామ పేరుతో ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని వ్యూహం పన్నాడు. అదును చూసుకొని ఆ స్థలంలో రాత్రికి రాత్రే గుడిసెలు వెయిం చాడు. కాలనీలోని ఓ దళిత నాయకుడు కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఫిర్యాదు అందుకున్న అధికారులు కూల్చివేశారు. కానీ ఆ బీఎస్పీ నాయకుడు మళ్ళీ గుడిసెలను వెయ్యించాడు. గతంలో కూల్చిన రెవిన్యూ అధికారులు మేడిపల్లి పోలీసుల పహరా కూల్చివేశారు. దీంతో కక్ష్య కట్టిన బీఎస్పీ నాయకుడు దళిత నాయకుడు, కాలనీ ఉపాధ్యక్షుడు బోడగళ్ళ సదానంద్ ఇంటిపైకి కొంతమంది అడవారితో వెళ్లి దౌర్జన్యం చేశాడు. దీంతో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దేవేందర్ కాలనీలోని అధికారులు ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సర్వేనంబర్ 63/1 లో ప్రభుత్వ పాఠశాలకు అనుకొని 1200 గజాల ప్రభుత్వ భూమిలో కబ్జా చేసి అక్రమ నిర్మాణాల కూల్చివేతలు నిర్వహించారు. తహసీల్దార్ హసీనా మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించమన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీఎం పేరు మంత్రులకే గుర్తుండడం లేదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మనం ఏదైనా పని చేస్తే అది పదితరాల వరకు గుర్తు ఉండాలని పెద్దలు చెబుతారు కానీ మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసే పనుల వల్ల ఆయన పేరును ఆయన సహచర మంత్రులే మర్చిపోతున్నారని ఎమ్మెల్సీ.చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఎద్దేవా చేశారు. తనను ఎదో బెదిరించాలని చూస్తే భయపడే వాడిని కాదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రభుత్వంపై అను చిత వ్యాఖ్యలు చేశారని అతని పార్టీ నుండి సస్పెండ్ చేసిన తర్వాత ఆయన మొదటి సారి సోమజిగూడ ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కాపాడేందుకు సీఎం బీసీ రిజర్వేషన్లను పక్కదారి పట్టించారని ఆరోపించారు. అదేసమయంలో కాంగ్రెస్‌లో ఉంటూనే ఆయన బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ పార్టీని నాశనం చేస్తున్నారని విమర్శించారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమికి సీఎం.రేవంత్ రెడ్డి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన షోకాజు నోటీసులు తీసుకున్న తాను బీసీలకు ఎందుకు రాజ్యాధికారం రాదో చూస్తానని అన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొన్న బీసీవాదులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు షోకాజు నోటీసులు పంపించేలా ప్రయత్నం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సెటైర్లు వేశారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనలో తప్పులు దొర్లాయని, సర్వే రిపోర్టు చిత్తు కాగితంతో సమానమని అన్నారు. బీసీలు, ప్రజలను మోసం చేసేందుకు చేపట్టిన సర్వే రిపోర్టు చిత్తు కాగితమనే తాను తగులబెట్టానని క్లారిటీ ఇచ్చారు.

బీసీకు న్యాయం జరగాలని కోరి తగులబెట్టడం తప్పు అయితే ఆ తప్పును తాను వెయ్యి సార్లు చేస్తానని అన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచే కులగణన చేయబోతున్నాం, తమ జన్మలు సార్థకం అయ్యాయంటూ ప్రభుత్వ పెద్దలు డైలాగులు కొట్టారని, సర్వేను తప్పుదోవ పట్టించారని తీన్మార్ మల్లన్న ఆరోపించారు.

ప్రధాన రహదారికి ఇరువైపుల సీసీ రోడ్డుకై పరిశీలన

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని గోపాల్ నగర్ ప్రధాన రహదారి నుండి జవహర్ నగర్ హాస్పిటల్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపుల సీసీ రోడ్డు నిమిత్తం రూ.52 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధితో రద్దీని నివారించవచ్చని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, ట్రాఫిక్ సిఐ నరసింహ, డీ.ఈ లౌక్యా, ఏ.ఈ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, కిషోర్, నారాయణ, ముత్యం రెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతకు ఉత్తమ పద్ధతులు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: రోజువారీ దిన చర్యలను నిర్వహించడం, సరైన బ్రషింగ్ పద్ధతులను అనుసరించడం, ఆయుర్వేద పరిష్కారాలను చేర్చడం వల్ల దీర్ఘకాలిక దంత ఆరోగ్యాన్ని నిర్ధారించవచ్చునని డాక్టర్ సోనియా దత్తా తెలిపారు. మొత్తం శ్రేయస్సుకు సమస్య లేని నోటి ఆరోగ్యం చాలా అవసరం. ఈ దంత వైద్య దినోత్సవం సందర్భంగా మీ చిరునవ్వును ఆరోగ్యంగా ప్రకాశవంతంగా ఉంచడానికి నిపుణులు సిఫార్సు చేసిన నోటి సంరక్షణ చిట్కాలను అందిస్తున్నట్లు తెలిపారు. సరైన నోటి సంరక్షణ దినచర్యను అనుసరించడం దీర్ఘకాలిక సమస్యల ప్రమాదాన్ని తగ్గించేటప్పుడు బలమైన దంతాలను నిర్వహించడానికి సహాయ పడుతుందని 27 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న ప్రఖ్యాత ప్రజారోగ్య దంతవైద్య నిపుణురాలు డాక్టర్ సోనియా దత్తా నొక్కి చెప్పారు. పేలవమైన దంత పరిశుభ్రత గుండె జబ్బులు డయాబెటిస్ వంటి పరిస్థితులతో ముడిపడి ఉందన్నారు. ఇది సమర్థవంతమైన రోజువారీ అలవాట్లను అవలంభించడం చాలా ముఖ్యమన్నారు. ఈ కాలం పరీక్షించిన ఆయుర్వేద పదార్థాలతో సుసంపన్నమైన డాబర్ రెడ్ పేస్ట్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడిఎ) సీల్ ఆఫ్ యాక్సెప్టెన్స్ను కూడా పొందింది. ఇది విశ్వసనీయ నోటి సంరక్షణ పరిష్కారంగా దాని విశ్వసనీయతను మరింత స్థాపించిందన్నారు. రోజువారీ దినచర్యలను నిర్వహించడం, సరైన బ్రషింగ్ పద్ధతులను అనుసరించడం డాబర్ రెడ్ పేస్ట్ వంటి ఆయుర్వేద పరిష్కారాలను చేర్చడం ద్వారా, మీరు దీర్ఘకాలిక దంత ఆరోగ్యాన్ని నిర్ధారించవచ్చన్నారు. మీ దంతాలు, చిగుళ్ళను రాబోయే సంవత్సరాల్లో ఆరోగ్యంగా ఉంచడానికి దంతవైద్యులు ప్రకృతి జ్ఞానాన్ని విశ్వసించాలన్నారు.

అధికారి ముందే ప్రైవేటు వ్యక్తుల పనుల నిర్వహణ

అయినా కింది స్థాయి సిబ్బందిని బలి చేస్తూ ఉత్తర్వులు...!

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి క్రింది స్థాయి బ్బందిని బలి చేయడమంటే పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి పాటించడమే వారికి శాపమైంది. గ్రేటర్ మున్సిల్ కార్పొర్పోరేషన్‌లో ఎంటమాలజీ విభాగంలో పని చేస్తున్న కార్వాన్ సర్కిల్ ఈఎఫ్ఏ, ఏ.ఈలను నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇద్దరి మృతికి కారణంగా చూపుతూ తొలగించేందుకు ఆదేశాలు జారి చేసిన అధికారులు వారి గోడును కూడ వినకపోవడం గమనార్హం. ఎంటమాలజీ సిబ్బంది చెరువులోకి దిగి గుర్రపు డెక్కను తొలగించాలని నిబంధనలు లేకపోయినా వారిని చెరువులోకి దించి పనులు చేయించి అదే తీరిలో పని చేయాలని ఆదేశించిన ఉన్నతాధికారికి శిక్ష ఉండదు, గుర్రపు డెక్క తొలగించేందుకు వచ్చిన బయటి వ్యక్తులకు కూలీలు ఇచ్చిన క్రింది స్థాయి సిబ్బందికి శిక్ష ఉండదు. కేవలం బాధ్యతల్లో ఉన్న పాపానికి వారిని బలి చేయడం గ్రేటర్ ఉన్నతాధికారుల ఏకపక్ష నిర్ణయం సరికాదని పలువురు పేర్కొంటున్నారు. యంత్రాలతో చేయించాల్సిన పనులను ఎంటమాలజీ సిబ్బంది, బయటి వ్యక్తులతో కూలీ పని చేయించమన్నది ఎవరో తెలుసుకునే ప్రయత్నం ఉన్నతాధికారులు చేయకపోవడం శోచనీయం. ఎంటమాలజీ ఉన్నతాధికారి ముందే ఎలాంటి భద్రత చర్యలు లేకుండా బయటి వ్యక్తులు పని చేస్తున్న సందర్భాలు ఉన్నాయని, అయినా ఆ అధికారి తీరును ఉన్నతాధికారులు ఎందుకు ప్రశ్నించలేకపోతు న్నారనే సందేహం వ్యక్తం అవుతోంది. కార్వాన్ సర్కిల్ మరో చెరువులో చనిపోయిన తండ్రి కొడుకులు సీనియర్ ఎంటమాలజిస్టు అధికారి ముందే ప్రైవేటు వ్యక్తులు పని చేస్తున్న క్రమంలో ఎలా ఎందుకు ప్రశ్నించకుండా ఉన్నారనే సందేహం లేకపోలేదు. గత కొద్ది రోజులగా సోహెల్ (మైనర్)తో చెరువులో పనులు చేయిస్తూ రోజు వారి కూలి ఇస్తున్న సందర్భాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. కరీంతో పాటు అతని కొడుకు సోహెల్ శాపం.. చెరువులో ఆ అధికారి ముందే పనులు నిర్వహించడం గమనార్హం. బయటి వ్యక్తులని గుర్తించలేకపోయారా లేక తనకు తెలిసి కూలి చేస్తున్నారని ఊరుకున్నారా అనే విషయం ఉన్నతాధికారులు విచారణ చేస్తే వాస్తవాలు బయటపడే అవకాశాలున్నాయి. అదీ కాక ఈ వ్యక్తులు ఎలాంటి సేఫ్టి ప్రికాషన్స్ లేకుండా ఉండడం కూడ గుర్తించలేకపోయారా? ఆ కోణంలో పరిశీలించినా బయటి వ్యక్తులు ఎవరు, ఎంటమాలజి సిబ్బంది ఎవరో గుర్తించే అవకాశం ఉంటుంది కాదా, దీన్ని బట్టి ఇక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరించింది ఉన్నతాధికారినా లేక ఎంటమాలజీ ఏఈ నా లేక ఎంటమాలజీ ఫీల్డ్ సూపర్‌వైసరా? దీన్ని ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉందని పలువురు ఎంటమాలజీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారి మాదిరిగానే పనులకు వచ్చిన కరీం, సోహెల్ దురదృష్ట వశాత్తు మృత్యువాతకు లోనుకావడం బాధాకరమని పలువురు వాపోతున్నారు. కరీంతో బయటి వ్యక్తులను కూలికి పిలిచేవారని, కరీం ఫోన్ ఎత్తకపోయినా ఆయన భార్యకు కూడ ఫోన్ చేయడం, మరో ఎంటమాలజీ సిబ్బందిని కరీం ఇంటికి పంపించి మాట్లాడేవారని తెలిసింది. కరీం కోవిడ్ కోసం తీసుకున్న సిబ్బందిలో ఒకరైనప్పటికీ తాను మాత్రం రోజు వారి కూలి క్రింద రోజుకు వెయ్యి రూపాయలు, ఆటో చార్జీ, భోజనం ఇప్పిస్తూ పనులు చేయించుకునే వారని తెలిసింది. కరీం మొదలు ఎల్‌బినగర్ జోన్‌లో ఉన్నప్పటికి ఇక్కడ మరో సీనియర్ ఎంటమాలజిస్టు రావడంతో కరీంతో చెరువులను శుభ్రం చేయించుకుంటారని భావించి కార్వాన్ సర్కిల్ ఎఫ్ఆర్‌సిలో పేరు నమోదు చేయించినట్లు ప్రచారం సాగుతోంది. సీనియర్ ఎంటమాలజిస్టు నిర్లక్ష్యంతో క్రింది స్థాయి సిబ్బందిని బలి చేయడం సరికాదని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు తిరిగి జరగకుండా సీనియర్ ఎంటమాలజిస్టులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంటమాలజీ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

రైతులకు మోదీ ద్రోహం

విశాలాంధ్ర - విజయవాడ: రైతుకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్డీఏ నేతృత్వంలోని మోదీ ద్రోహం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో రైతు సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. దీనిలో భాగంగా విజయవాడ లెనిన్ సెంటర్లో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ మద్దతు ధరలు, రైతులకు ఆర్థిక తోడ్పాటు వంటి అంశాలలో కేంద్ర ప్రభుత్వం నియమించిన పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలను కూడా అమలు పరిచేందుకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గ మన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా అమలుకు పూనుకోవడం బాధాకమన్నారు. మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించ దానికి మరో మూడు పథకాలు రూపొందించిందని, రైతుల అజమాయిషీలో ఉన్న ప్రాథమిక సహకార సంఘాలను, మత్స్యకారు రైతుల సహకార సంఘాలను, పాడీరైతుల సహకార సంఘాలను పెట్టుబడిదారులకు అప్పగించేందుకు చట్టం చేసిందన్నారు. డిజిటల్ అగ్రిమిషన్ పేరుతో 11 కోట్ల మంది రైతులను కార్పొరేట్ కంపెనీలకు కట్ట బెట్టడానికే ఈ పథకాన్ని రూపొందించిందని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఈ ఏడాది మిర్చి, కంది, జొన్న, మొక్కజొన్న, పత్తి, టమోట, ఉల్లి, శనగ, పొగాకు వంటి అన్ని పంటల ధరల పతనమై రైతుల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వైట్ బర్లీ పొగాకు కొనడం కుదరదని పొగాకు బోర్డు తెగేసి చెప్పడం బాధాకరమన్నారు. జీడి మామిడి ధర పడిపోయిందని, మిర్చికి ప్రకటించిన ధరల వ్యత్యాశ పథకం రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరదన్నారు. ధాన్యానికి పొరుగు రాష్ట్రాలు బోనస్ ఇస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోగా పంటలను కొనుగోలు చెయ్యకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఆరు లక్షల ఎకరాలల్లో మామిడి తోటలకు ఎర్రనల్లి ఆశించి పూత రాలిపోయిందని ప్రభుత్వం ఆదుకునే చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇక మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాయలసీమ మరియు వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తగిన నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. తెలుగుగంగ, పూలసుబ్బయ్య వెలుగొండ, గాలేరు నగరి, హంద్రీ-నీవా ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీ-నివా కాలవను విస్తరింప చేయడానికి బదులు లేనింగ్ చేయటం రాయలసీమను శాశ్వతంగా కరువు సీమగా మార్చడమేనన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సభకు అధ్యక్షతన వహించిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని పంటలకు 50శాతం ప్రకారం మద్దతు ధరలు ప్రకటించి అమలుకు పార్లమెంట్లో చట్టం చేయాలని, రైతులకు, కౌలురైతులకు, వ్యవసాయ కార్మికులకు రుణమాఫీ చేయాలని,కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకువచ్చి ఆత్మహత్యల నుండి రైతాంగాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. ధరల స్థిరీకరణ నిధిని పునరుద్ధరించి రాష్ట్రంలో అన్ని పంటలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. మిర్చి క్వింటాలకు రూ.20వేలు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ అటవీ హక్కుల 1/70 చట్టాన్ని అమలు చేయాలని, 60 సంవత్సరాలు నిండిన రైతులు, కౌలురైతులకు, వ్యవసాయ కార్మికులకు, పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. పంట కాలవలు, డ్రెయిన్లు, ఎత్తిపోతల పథకాలు మరమ్మత్తు పనులను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కౌలురైతులను గుర్తించక పోవడం దుర్మార్గమన్నారు. పీఎం కిసాన్ పథకానికి నిధులు పెంచి కౌలురైతుకు కూడా వర్తింపు చేయాలని, భూ యజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా కౌలురైతులకు పంటరుణాలు ఇచ్చి ఆదుకోవా లని కోరారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగ కుటుంబాలకు తక్షణమే ఎక్స్ గ్రేషియా చెల్లించి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ అధ్యక్షులు రెడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కేంద్రం చేస్తున్న అన్ని రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేస్తున్నదన్నారు. ప్రజలకు నష్టమైన సెకీ ఒప్పందాన్ని అమలు చేస్తున్నదని దీంతో పాటు అన్నిరకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు యు. వీరబాబు మాట్లాడుతూ నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. జాగృతి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం 20,000 తక్షణమే చెల్లించాలని కోరారు. ప్రకృతి విపత్తుల నిధుల నుండి రైతులను ఆదుకోవడానికి కేటాయించాలని కోరారు. కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు మాట్లాడుతూ కౌలుదారులకు, దేవాలయం భూములు సాగు చేసే కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయలన్నారు. బంజర సాగుదారులకు, చుక్కల భూములు సాగు చేసేవారికి పట్టాలు ఇచ్చి రుణాల పథకాలు అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ బండ్ల శ్రీనివాసరావు, ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి, కార్మిక సంఘ నాయకులు కాసాను గణేష్, రైతు నాయకులు రంగారెడ్డి,మున్నంగి నరసింహారావు, వెంకటరెడ్డి ,కొప్పుల విజయ బాబు తదితరులు పాల్గొన్నారు.

'వృత్తి' నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

సీఆర్ ఫౌండేషన్‌లో 13 వేల మంది మహిళలకు శిక్షణ: నారాయణ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: లింగ సమానత్వానికి, స్థిరమైన అభివృద్ధికి మహిళల ఆర్థిక సాధికారత కీలక పాత్ర పోషిస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె. నారాయణ అన్నారు. ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రంలో వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వృత్తి విద్యలో నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. ఫౌండేషన్ ఆవరణలోని యార్లగడ్డ భాగ్యవతి భవనంలో వివిధ వృత్తివిద్యా కోర్సులను 2004లో ప్రాంభించామన్నారు. కంప్యూటర్, కుట్టు, బ్యూటీషియన్, డ్రెస్ మేకింగ్, మగ్గం, మిషన్ ఎంబ్రాయిడరీ తదితర కోర్సులలో యువతులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇంగ్లీష్, సోషల్ అవగాహనా తరగతులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 13 వేల మంది యువతులు శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందుతున్నారని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రొఫెషనల్ కోర్సులను ప్రారంభిస్తామని నారాయణ వెల్లడించారు. డాక్టర్ డి. ప్రతిభ మాట్లాడుతూ మహిళా ఆర్థిక సాధికారతలో వృత్తివిద్యా కోర్సులు కీలక పాత్ర పోషిస్తాయని, నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యులు పి. ప్రేమ్ పావని స్వాగతం పలుకగా, డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన నివేదిక సమర్పించారు. డాక్టర్ డి.ఎస్. కుమార్, స్వామి రామానంద తీర్థ గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కిషోర్ రెడ్డి, మహిళా సంక్షేమ కేంద్రం సలహాదారు ఉష రాణి, కమిటీ సభ్యులు డాక్టర్ బి.వి. విజయలక్ష్మి, కృష్ణ కుమారి, వి. లలిత, మమతా ఆరుట్ల, ఫౌండేషన్ కార్యదర్శి సంధ్య రాణి, వి. చెన్నకేశవ రావు హాజరయ్యారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర- పామూరు: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణకు సమర్థ కమిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ సంపదను దోచుకుంటున్న వారిని అరెస్టు చేయాలని, వారి నుంచి సొమ్ము రికవరీ చేయాలన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు బుధవారం ప్రకాశం జిల్లా, పామూరు మండలంలో అగ్రిగోల్డ్ సంస్థకు సంబంధించిన జామాయిల్ తోటలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జామాయిల్ అక్రమ రవాణాను నిరోధించాలని, దొంగలను శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఎవరున్నా జామాయిల్ అక్రమ రవాణా ఆగడం లేదని విమర్శించారు. ఎనిమిది రాష్ట్రాలలో 32 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని ముప్పాళ్ల నాగేశ్వరరావు గుర్తుచేశారు. 2015లో ఆస్తులను ప్రభుత్వం అటాచ్ చేసుకున్నదని, నాటి నుంచి నిరవధిక పోరాటాలు చేస్తున్నా ఫలితం లేదన్నారు. అగ్రిగోల్డ్ స్థాపకులతో ప్రభుత్వాలు కుమ్మకయ్యాయని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి తలిస్తే ఈ సమస్యను ఒక గంటలో పరిష్కరించవచ్చన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి... వచ్చిన దాంతో బాధితులకు చెల్లించిన తర్వాత ప్రభుత్వానికి కొంత మిగులుతుందని చెప్పారు. కలప అక్రమ రవాణా కట్టడిలో డీజీపీ, అధికారులు విఫలమవుతున్నారని ముప్పాళ్ల అన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణకు స్థానిక శాసనసభ్యులు తమ వంతు కృషి చేయాలని కోరారు. సమర్థ అధికారులతో కమిటీ వేసి, నిర్దిష్ట సమయంలో తగు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు మరింత తీవ్రతరం అవుతాయని ప్రభుత్వాన్ని ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ మూతపడి 11 ఏళ్లుకాగా, 16 వేల ఎకరాల భూములను సీఐడీ స్వాధీనం చేసుకుందన్నారు. త్వరలో ముఖ్య మంత్రిని కలిసి అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించి... బాధితులకు న్యాయం చేయాలని కోరుతామని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి

ప్రభుత్వ భూమిలో ఎర్ర జెండాలు

విశాలాంధ్ర-బేతంచెర్ల: అర్హులైన వారికి మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయిం చాలని ప్రభుత్వ భూమిలో సీపీఐ జెండాలను పాతారు. నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలంలోని అంబాపురం గ్రామంలోని ప్రభుత్వ భూమిని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యుడు పి.సుంకయ్య అధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. పేదలకు కనీస వసతుల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలపై రాజకీయ పెత్తనాన్ని ఆక్షేపించారు. అధికార పార్టీకి చెందిన వారికి గతంలో ఇంటి స్థలాలు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన అందరికీ మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం పంచి తీరుతామని నాయకులు ఉద్ఘాటించారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ వర్గాల నిరుపేదలకు అండగా నిలుస్తామన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పేదలు స్వాధీనం చేసుకున్న భూమిని మూడు సెంట్ల చొప్పున వారికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్నా, సహాయ కార్యదర్శి తాలూకా తిరుమలేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శివయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, సీనియర్ నాయకులు సంజీవులు, ఎర్రగుడి రాముడు, కోన రామకృష్ణ, అంబాపురం నాయకులు సోమన్న, నాగేశ్వరరావు, శ్రీరాములు, భాస్కర్, ఎల్లకృష్ణ, రాజ్యలక్ష్మి, సంతోషమ్మ పాల్గొన్నారు.

ప్రపంచాన్ని కాపాడిన మహానేత జోసెఫ్ స్టాలిన్

సామాజిక విప్లవం సోషలిస్ట్ కమ్యూనిస్టులతోనే సాధ్యం: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): హిట్లర్ ఫాసిజం బారి నుంచి అగ్ర దేశాలతో సహా మొత్తం ప్రపంచాన్నే కాపాడిన మహానేత జోసెఫ్ స్టాలిన్ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. విశ్వ విప్లవనేత జోసెఫ్ స్టాలిన్ 72వ వర్ధంతి సందర్భంగా బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోషలిస్ట్ కూటమి అధ్వర్యంలో సామాజిక విప్లవ సభ నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన జల్లి విల్సన్ మాట్లాడుతూ పెద్ద శత్రువుని ఎదుర్కోవాలంటే చిన్న శత్రువులను మిత్రులుగా చేసుకోవాలని, అప్పుడే మనం సుభిక్షంగా జీవించగలం అని చెప్పి... దానిని ఆచరణలో చూపించి సోవియట్ రష్యాను కాపాడుకున్నారన్నారు. హిట్లర్‌కు దగ్గరగా ఉన్న దేశాలన్నింటిని తన రాజకీయ చాకచక్యంతో తనవైపు తిప్పుకుని ప్రపంచాన్ని కాపాడిన నేత అన్నారు. నేడు సామాజిక విప్లవం తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అది సోషలిస్ట్ కమ్యూనిస్ట్‌లతోనే సాధ్యమన్నారు. సామజిక ఉద్యమం ద్వారానే అసమానతలు తొలగుతాయన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వల్ల ప్రజలకు మేలు కనిపించడం లేదన్నారు. ప్రైవేట్ రంగాల్లో అణగారిన వర్గాల వారికి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా... ఫలాలు పేద వర్గానికి దక్కడం లేదన్నారు. రాజ్యాంగం ప్రకారం అట్టడుగు వర్గాలు, నిమ్నజాతులకు రిజర్వేషన్లు ఉన్నా ఉద్యోగాలు దొరికే పరిస్థితి ప్రస్తుతం కానరావటం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు, గనులు కేటాయించకుండా నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన సోషలిస్ట్ నాయకులు ఎల్.జైబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలులో గత పాలకులు విఫలమయ్యారన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అణగ దొక్కుతున్నారన్నారు. ఆర్‌టిఐ ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు పత్తిపాటి చంద్రమోహన్ మాట్లాడుతూ దేశంలో సమాచార చట్టంతో పేద వర్గాల్లో విప్లవం వచ్చిందన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎమ్.రామకృష్ణ మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా అగ్రవర్ణాలే లబ్ధిపొందుతున్నాయన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్, ప్రజా అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ములింటి సుదర్శన్, బసవయ్య, అశోక్, అంగడాల పూర్ణ, పి.శ్రీనివాస్, జల్లి వసంత, కారల్ మార్క్స్, పి.శ్రీను, పద్మారావు, సునీల్ పాల్గొన్నారు.

వలసలు నివారించండి

'ఉపాధి'కల్పనలో అధికారుల విఫలం: ఆవుల శేఖర్

కలెక్టరేట్ల వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నేతల ధర్నా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రాష్ట్ర వ్యాప్తంగా వలసల నివారణకు డ్వామా అధికారుల అలసత్వమే కారణమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేయాలంటూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా కర్నూలు జిల్లా డ్వామా అధికారి వెంకటసుబ్బయ్యకు సంఘ జిల్లా కార్యదర్శి ఎం.నబిరసూల్, కె.మద్దిలేటి శెట్టి, కారుమంచితో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం శేఖర్ మీడియాతో మాట్లాడుతూ... వలసలు ఆపకుండా వలసలపై అధికారులు వక్రభాష్యాలు వల్లిస్తున్నారని, అధిక కూలీ కోసం వలసల పోయారని చెప్పడం తగదన్నారు. కర్నూలు జిల్లా అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉందని, వలసలు తీవ్రమయ్యాయని, గ్రామాల్లో వేలాది పేద కుటుంబాలు వలసలు వెళుతున్నా అధికారులు స్పందించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధి హామీలో రాజకీయ పెత్తనం చేస్తున్నారని, అధికారులు కూడా వారికి వంత పడుతున్నారని విమర్శించారు. కింది స్థాయి ఉద్యోగులను అకారణంగా తొలగించడం మంచికాదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు కల్పించి వలసలు ఆపాలని, నిధులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. రోజు కూలీ రూ.700 ఇవ్వాలన్నారు. కాంట్రాక్టర్లను, యంత్రాలను నిషేధించాలని, కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. పని ప్రదేశాలలో టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరణ చేయాలన్నారు. మేట్ల వ్యవస్థ తీసుకువచ్చి వారికి

గుర్తింపు కార్డులు ఇచ్చి రోజుకు రూ.ఐదు పారితోషకం, పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. పోస్ట్ ఆఫీస్ ద్వారా బిల్లులు చెల్లించాలని కోరారు. పాత బకాయిలు తక్షణం విడుదల చేయాలన్నారు. పని ప్రదేశంలో మరణిస్తే రూ.10 లక్షలు పారితోషికం, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. గ్రామ సభల్లో పనులు ఎంపిక చేసి బహిరంగంగా వెల్లడించాలని కోరారు. కాగా, అనంతపురం జిల్లాలో జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రంగయ్య, బి.కేశవ రెడ్డి, నంద్యాలలో జిల్లా కార్యదర్శి కె. రాధాకృష్ణ, ప్రతాప్, పుట్టపర్తిలో జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి బాలస్వామి, కదిరిప్ప, కడపలో సుబ్రహ్మణ్యం, బ్రహ్మం, మునీంద్ర, మనోహర్ రెడ్డి, అన్నమయ్య జిల్లాలో మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. కిష్టప్ప, పండుగోల మని, జయరామయ్య, తిరుపతి జిల్లాలో సిహెచ్. ప్రభాకర్, పి.రామానాయుడు, తులసిరాజన్, పెంచలయ్య, చిత్తూరు జిల్లాలో రామమూర్తి, నెల్లూరు జిల్లాలో రమణయ్య, దర్గాబాబు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల పొట్టకొడతారా?

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించాలి

ఓబులేసు

విశాలాంధ్ర-తిరుపతి : రాష్ట్ర వ్యాప్తంగా వీధి వ్యాపారుల సమగ్ర సర్వే నిర్వహించి వ్యాపారులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీధి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా రెండవ మహాసభలు తిరుపతి నగరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదట అన్నమయ్య సర్కిల్ వద్ద నుంచి ఎయిర్ బైపాస్ రోడ్డు, బైరాగి పట్టెడ వరకు మహా ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన డప్పుల మోతలు, నినాదాలతో మారుమ్రోగింది. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, వెండింగ్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని, ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేయడం మానుకోవాలని, అక్రమ గేటు వసూళ్లను నిలుపుదల చేయాలని, నగరంలో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని నినదించారు. అనంతరం బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఓబులేసు పతాక ఆవిష్కరణ చేశారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలు ఆలపించారు. గౌరవ అతిథి ఓబులేసు మాట్లాడుతూ దేశంలో రెండు కోట్ల 60 లక్షల మందికి పైగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి వ్యాపారులకు చట్టాలు చేసినప్పటికీ, అధికారులు వాటిని అమలుపరచకుండా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగిపోయి వ్యాపారుల పొట్టకొడుతున్నారని విమర్శించారు. తిరుపతి జిల్లాలో 30 వేల మందికి పైగా వీధి వ్యాపారులను గుర్తించామని చెబుతున్న అధికారులు... ఎంతమందికి గుర్తింపు కార్డులు ఇచ్చారో చెప్పగలరా అని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా మార్కెట్ గెజిట్‌కు వ్యతిరేకంగా డబ్బులు వసూలు చేస్తుంటే మునిసిపల్ కమిషనర్‌గానీ, పోలీసు, ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ కమిటీ ఎందుకు అడ్డుకోవడం లేదని, ఆ వసూళ్లలో పైన తెలిపిన అధికారులకు ఎవరికైనా లాభాలు ఉన్నాయా అని నిలదీశారు. వీధి వ్యాపారులకు రక్షణ కల్పించాలని సుప్రీం కోర్టు చెప్పిందని, వారికి రక్షణగా వీధి వ్యాపారుల చట్టం-2014 ఉందని, అయినప్పటికీ అధికారులు చట్టానికి తూట్లు పొడుస్తూ, వ్యాపారులకు నష్టం కలిగించే రీతిలో వ్యవహరించడం సిగ్గుచేటు అని ఓబులేసు విమర్శించారు. ఈ రెండవ మహాసభలకు వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివకుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర సంఘం కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్లు, ఎస్.డి.రవి, వైఎస్ మనీ, నాగేంద్ర, శ్రీరాములు, శివ ప్రసంగించారు. వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాలకు పూర్తి మద్దతు తెలియజేస్తామన్నారు. యూనియన్ నాయకులు శ్రీనివాసులు, బైరాగి పట్టెడ వీధి వర్తక వ్యాపార సంఘం జిల్లా అధ్యక్షులు మునీంద్ర, జిల్లా నాయకులు శ్రీనివాసులు,ముని, బాలాజీ, సరిత, సుధాకర్, జనార్దన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కథనాలు సృష్టించొద్దు

కల్పన కుమార్తె వివరణ

విశాలాంధ్ర-హైదరాబాద్: తన తల్లి, సినీ గాయని కల్పనపై తప్పుడు కథనాలు సృష్టించవద్దని ఆమె కుమార్తె దయ విజ్ఞప్తి చేశారు. తన తల్లిది ఆత్మహత్యాయత్నం కాదని చెప్పారు. కల్పన ఆరోగ్య పరిస్థితిపై ఆమె కుమార్తె మీడియాతో మాట్లాడారు. 'అమ్మ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆమె గాయని మాత్రమే కాదు ప్రస్తుతం ఎల్ఎల్‌బీ, పీహెచ్‌డీ కూడా చేస్తున్నారు. ఇటీవల ఇన్‌సోమ్నియాతో ఇబ్బందిపడ్డారు. వైద్యుల సూచన మేరకు ఆమె మాత్రలు తీసుకుంటున్నారు. ఒకింత ఎక్కువ మోతాదులో మందులు తీసుకోవడం వల్ల ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అంతేకానీ, ఆమె ఆత్మహత్యాయత్నం చేయలేదు. దయచేసి తప్పుడు కథనాలు సృష్టించవద్దు. మా కుటుంబమంతా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు ఆనందంగా జీవిస్తున్నారు. త్వరలోనే ఆమె ఇంటికి తిరిగి వస్తారు' అని చెప్పారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీ విల్లాలో ఉంటున్న కల్పన మంగళవారం సాయంత్రం చెన్నైలో ఉన్న భర్తకు ఫోన్ చేసి అపస్మారక స్థితిలోకి వెళ్తున్నట్లు చెప్పారు. ఆయన వెంటనే కాలనీ సంఘం ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు చెప్పారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే కల్పన అపస్మారక స్థితిలో ఉన్నారు. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 'కల్పన ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని, ఇన్‌ఫెక్షన్ ఉండటం వల్ల ఆక్సిజన్ అందిస్తున్నామని కల్పన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

నేను ఆత్మహత్యాయత్నం చేయలేదు: కల్పన

తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని, తన కుమార్తెతో వచ్చిన మనస్పర్థల వల్ల నిద్రపట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు కల్పన చెప్పిన విషయాన్ని కేపీహెచ్‌బీ పోలీసులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ ఘటనలో ఎవరి ప్రమేయం లేదని ఆమె చెప్పినట్టు పోలీసులు పేర్కొన్నారు. తనకు, తన కుమార్తెకు జరిగిన విషయంలో నిద్ర పట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడం వల్ల ఇలా జరిగిందని ఆమె వెల్లడించినట్టు చెప్పారు.

జగన్‌ను క్షమించి వదిలేస్తున్నా: స్పీకర్ అయ్యన్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్పీకర్‌కు దురుద్దేశాలు ఆపాదించడం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, అయినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని క్షమించి వదిలేస్తున్నానని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు తెలిపారు. బుధవారం శాసన సభ సమావేశాలు ప్రారంభం కాగానే జగన్ తనకు ప్రతిపక్ష హోదా కావాలంటూ చేస్తున్న రాద్ధాంతంపై స్పీకర్ ప్రకటన చేశారు. అసత్యాలు ప్రచారం చేసే ధోరణితో జగన్ వ్యవహరిస్తున్నారు. వారు చేస్తున్న ఆరోపణలు గందరగోళానికి దారి తీస్తున్నాయి. స్పీకర్‌కు దురుద్దేశాలు ఆపాదించడం సభా నియమాల ఉల్లంఘన కిందికి వస్తాయి. దేవుడు తిరస్కరించిన వరాన్ని పూజారి నుంచి ఆశించడం తప్పు అని అయ్యన్న వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే సరైన సంఖ్యా బలం ఉండాలని చట్టం చెబుతోంది. 175 మంది సభ్యులున్న శాసనసభలో కనీసం 18 మంది సభ్యుల బలం ఉంటే తప్ప ప్రతిపక్ష హోదా రాదు. అంటే కనీసం 10 శాతం సభ్యులు ఉంటేనే ప్రతిపక్ష హోదా వస్తుందనే నిబంధనను గతంలో జగనే సభలో ప్రస్తావించారు. ఇవన్నీ తెలిసీ జగన్ చేసిన ప్రేలాపనలను సభాపతి హోదాలో క్షమించి వదిలేస్తున్నా. అభియోగాలు, ప్రేలాపనలు, బెదిరింపులతో జగన్ నాకు గత ఏడాది జూన్ 24న లేఖ రాశారు. తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా సభను ఆదేశించాలని హైకోర్టును కూడా ఆశ్రయించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.